జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php








సంపుటి 5 | సంచిక 345 | హైదరాబాద్, అక్టోబరు 05 బుధవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00







## రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు చెప్పిన కేసీఆర్



హైదరాబాద్: ధర్మస్థాపనకు నిదర్శనంగా..విజయాలను అందించే విజయదశమిగా దసరా పండుగను దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని సీఎం కేసీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా రోజున శుభసూచకంగా పాలపిట్టను దర్శించి పవిత్రమైన జమ్మిచెట్టుకు పూజలు చేసే సాంప్రదాయం గొప్పదని చెప్పారు. జమ్మి ఆకును బంగారం ++లా భావించి పంచుకొంటూ, పెద్దల ఆశీర్వాదాలను అందుకుంటూ, అలయ్ బలయ్ తీసుకొంటూ ప్రేమాభిమానాలను చాటుకోవడం దసరా పండుగ ప్రత్యేకత అని సీఎం కేసీఆర్ అన్నారు. అనతికాలంలోనే అభివృద్ధిని సాధించి రాష్ట్రాన్ని ముందంజలో నిలిపిన తెలంగాణ పాలన, దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ స్ఫూర్తితో దేశం ప్రగతిబాటలో నడవాలని సీఎం ఆకాంక్షించారు. విజయానికి సంకేతమైన దసరా నాడు తలపెట్టిన కార్యాలన్నీ ఫలించాలని అన్నారు.

**కేసీఆర్‌కు మద్దతుగా క్రైస్తవ మత పెద్దల ఏకగ్రీవ తీర్మానం**

జాతీయ పార్టీ ప్రకటిస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిజామాబాద్ సీఎస్ఐ చర్చిలో క్రైస్తవ మత పెద్దలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో బిషప్ సాల్మన్ రాయ్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ వెంటే తామంతా ఉంటామని స్పష్టం చేశారు. ఆ దేవుడి ఆశీస్సులు కేసీఆర్‌కు ఉండాలన్నారు. కేసీఆర్ లాంటి నాయకులు ఈ దేశానికి అవసరమని పేర్కొన్నారు. సెక్యులర్ దేశంగా భారత్ ఉండాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని చెప్పారు. మతతత్వ పార్టీలతో దేశానికి ముప్పు ఉందన్నారు. దేశ రక్షణ కోసం మనమంతా కలిసి ఉండాలని సూచించారు. తెలంగాణ క్రైస్తవులందరూ కేసీఆర్ వెంటే ఉన్నారు. జాతీయ పార్టీ ప్రకటిస్తున్న నేపథ్యంలో కేసీఆర్‌కు శుభాంక్షాలు తెలియజేస్తూ.. దేవుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తున్నామని సాల్మన్ రాయ్ పేర్కొన్నారు.

## కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామికి కేటీఆర్ స్వాగతం



హైదరాబాద్ : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామికి టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బేగంపేట్ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తో పాటు పలువురు నేతలు ఉన్నారు. కేసీఆర్ రేపు ప్రకటించబోయే జాతీయ పార్టీ కార్యక్రమంలో కుమారస్వామి పాలు పంచుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే కుమారస్వామి హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 11వ తేదీన సీఎం కేసీఆర్‌తో కుమారస్వామి ప్రగతి భవన్‌లో సమావేశమై దేశ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌కు ఉన్న అపార అనుభవం ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ఎంతో అవసరమని కుమారస్వామి అభిప్రాయపడిన విషయం విదితమే. సకల వర్గాలతో కలిసి ముందుకు సాగి, శాంతియుతంగా ఉద్యమించి తెలంగాణను సాధించి.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ నెరవేరుస్తున్నారని కొనియాడారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటులో కేసీఆర్ క్రియాశీల భూమిక పోషించాలని కోరారు. ఇందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కుమారస్వామి నాడే ప్రకటించారు.

## భారీ కటౌట్లు.. దేశ్ కీ నేత ఫ్లెక్సీలు..




హైదరాబాద్ :హైదరాబాద్ నగరం మళ్లీ గులాబీమయంగా మారిపోయింది. నిబంధనలు ఉల్లంఘిస్తూ నగరంలో ఎక్కడ చూసినా సీఎం కేసీఆర్ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. దసరా నాడు జాతీయ పార్టీకి సంబంధించి సీఎం కేసీఆర్ ప్రకటన చేయనున్న నేపథ్యంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లకిరువైపులా ఫ్లెక్సీలు, హోర్డింగులతో నింపేశారు. బీఆర్ఎస్, దేశ్ కీ నేత అనే నినాదాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతానని ప్రకటించిన సీఎం కేసీఆర్.. అందులో భాగంగా టీఆర్ఎస్ పార్టీ పేరు మార్చేందుకు సిద్ధమయ్యారు. అక్టోబర్ 5న దసరా నాడు టీఆర్ఎస్ భవన్ లో జరగనున్న సర్వసభ్య సమావేశంలో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ పార్టీగా మారుస్తూ తీర్మానం చేయనున్నారు. ఈ క్రమంలో ప్రగతి భవన్ సహా పలు ప్రాంతాల్లో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇక జంజారాహిల్స్?లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఎటు చూసినా భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లే దర్శనమిస్తున్నాయి. దేశ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న సీఎం కేసీఆర్ కు అభినందనలు తెలుపుతూ టీఆర్ఎస్ నాయకులు, పలువురు నేతలు నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీలు, కటౌట్ లు, బ్యానర్లతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి సిటీలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని, అలా చేస్తే తొలగించాల్సిందేనంటూ స్వయంగా మంత్రి కేసీఆర్ గతంలో ఆదేశించారు. మరోవైపు జీహెచ్ఎంసీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే భారీ జరిమానా వసూలు చేస్తామని హెచ్చరించింది. అయితే టీఆర్ఎస్ నేతలకు నిబంధనలు తుంగలో తొక్కుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## హామీల అమలుకు నిధులు ఎలా?

### రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ




న్యూఢిల్లీ బ్యూరో : ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు నిధులు ఎలా సమకూర్చుతారో తెలపాలని రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు ఇసి లేఖ రాసిం ఈ లేఖలోనే తెలియచేయాల్సిన వివరాలను ఒక పట్టిక రూపంలో జతపరిచింది. ఈ నెల 19వ లోగా సమాధానం పంపాలని, ఒక వేళ చెప్పకపోతే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) సవరణకుఆ పార్టీలు చెప్పేదేమి లేదని భావించాల్సివస్తుందని పేర్కొంది. (మిగతా 2లో..)

## 19 మున్సిపాలిటీలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు : మంత్రి కేటీఆర్




హైదరాబాద్ : అద్భుతంగా పురోగతి సాధిస్తున్న గ్రామాలు, పట్టణాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు సాధించిన 19 మున్సిపాలిటీలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ నిధులను ప్రత్యేకంగా పారిశుధ్యం కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు- 2022 సాధించిన మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, కమిషనర్ల అభినందన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బడంగ్‌పేట్, కోరుట్ల, (మిగతా 2లో..)

## రాజకీయాల కోసం మాట్లాడే వారికి సమాధానం ఇవ్వం




హైదరాబాద్ :కేంద్రం ఇస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఓవైపు రాష్ట్రం పనితీరు (మిగతా 2లో..)







## బడి తండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం

**అన్నదానాన్ని కార్యక్రమాన్ని ప్రారంభించిన బోనకల్ ఎస్సై కవిత**



బోనకల్, అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రావినూతల బడి తండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోగ్రామ సోమవారం రాత్రి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి బోనకల్ ఎస్సై కవిత ముఖ్యఅతిథిగా హాజరై దుర్గాదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ శ్రీ కనకదుర్గా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కవిత మాట్లాడుతూ శ్రీ కనకదుర్గా దేవి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ఆ తల్లి కృపా కటాక్షాలతో అందరూ సుఖ సతోషాలతో వర్ధిల్లాలని, సిరి సంపదలతో దుర్గాదేవి చల్లని దీవెనలు గ్రామ ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు పంతు, సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ ,ఎంపీటీసీ కందిమల్ల రాధ,టీఎస్ యుటిఎఫ్ మండల కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, ఐద్వా నాయకురాలు గుగులోతు శారద, ఉప సర్పంచ్ బోయినపల్లి కొండలు, గ్రామ పెద్దలు షేక్ జానీ, బానోతు కృష్ణ, బానోతు నాగేశ్వరరావు, బానోతు రమేష్ , బానోత్ సురేష్, బానోత్ శ్రీను, గుగులోతు రాములు, గుగులోతు నరేష్, తండ మహిళలు, చిన్నలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయుధ పూజ చేసిన ఆస్పత్రి సిబ్బంది



బెల్లంపల్లి అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి: విజయదశమి, దసరా పండుగ సందర్భంగా, ప్రతి సంవత్సరం జరిపే ఆయుధ పూజా కార్యక్రమాన్ని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ లో డి వై సీ ఎం ఓ, డాక్టర్ రామాల శౌరి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్ లోని శస్త్ర చికిత్సకు ఉపయోగించే బాయిల్స్ ఆపరేటర్స్, సి ఆమ్స్ యంత్రాన్ని, వివిద పరికరాలను సీనియర్ వార్డు అసిస్టెంట్ శ్రీధర్ దంపతులు శస్త్ర చికిత్సలు చేసే పరికరాలతో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి, ఆసుపత్రి ఫిట్ సెక్రటరీ అనుముల సత్యనారాయణ, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శులు, దండ బోయిన భాస్కర్, రసరంజని,మాట్రన్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మాట్రన్ దాసరి అరుణ సుందరి, నర్సింగ్ సిబ్బంది, వార్డ్ అసిస్టెంట్లు, జనరల్ కార్మికులు, ఎలక్ట్రీషియన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 16వ డివిజన్లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు




మేడిపల్లి, అక్టోబర్4 (ప్రజాపాలన ప్రతినిధి):పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ గణేష్ నగర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం సమీపంలో స్థానిక కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సద్దుల బతుకమ్మ సంబరాల్లో భాగంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్ లతో కలిసి మేయర్ జక్క వెంకట్ రెడ్డిమొదటి బహుమతి రూ3116/ 2వ బహుమతి రూ 2116/ 3వ బహుమతి రూ1116/బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు



ప్రజాపాలన కొడంగల్ ప్రతినిధి అక్టోబర్ 04:వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని రావులపల్లి గ్రామంలో, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర సమితి మాజీ స్టేట్ ఎస్ సి సెల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాకులారం ఉదయ్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పూజలు

ఎర్రుపాలెం అక్టోబర్ 4 ప్రజాపాలన ప్రతినిధి ఎర్రుపాలెంమండలం జమలాపురం నందు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నేడు మహర్నవమి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈరోజు మహర్నవమి సందర్భంగా అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అలంకారం లో భక్తులకు దర్శనం ఇచ్చినారు. ప్రాతఃకాల పూజల అనంతరం గోపూజ నిర్వహించినాము. నిత్య హెూమములు, అనుష్టానములు జరుపబడినవి. అనంతరం యాగశాలలో ఏర్పాటు చేసిన మహిషాసుర మర్దిని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవస్థాన ప్రాకార మండపంలో చండీ హెూమము నిర్వహించడం జరిగినది. ఛండీ హెూమం లో 17 మంది దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించబడుచున్న చండీ హెూమం కార్యక్రమాలు ఈరోజు 12 గంటల 30 నిమిషములకు పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించిన అనంతరం చండీ హెూమ కార్యక్రమాలు ముగిసినాయి. చండీ హెూమంలో పాల్గొన్న వారికి స్వామివారి శేష వస్త్రములు, ప్రసాదములు అందజేయడం జరిగినది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదముల వితరణ జరిగింది. ఈరోజు దేవస్థానం యొక్క అన్నపూర్ణ నిత్యాన్నదాన సత్రంలో భక్తులందరికీ విశేషంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు మరియు వేద పండితులు,రుత్వికులు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు బి.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కే.విజయ కుమారి, సిబ్బంది, భక్తులు మరియు జమలాపురం గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం వారు ఏర్పాట్లు చేసినారు.రేపు అనగా బుధవారం సాయంత్రం 5-30 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం యాగశాల వద్ద శమీ పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగుతుంది. ఆలయ కమిటీ వారు తెలిపారు.

## తాండూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




బెల్లంపల్లి అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో శ్రీ సాయి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సురభి ఫంక్షన్ హాల్ లో మంగళవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ సురభి ఆగమ రావు మాట్లాడుతూ, సేవే పరమార్ద%శీ%గా క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మండల ప్రజల కోసం దాతల సహకారంతో బాడీ ఫ్రీజర్ అందుబాటులో ఉంచామని, సెప్టెంబర్ 24 న కంటి పరీక్షలు నిర్వహించి, పలువురికి ఆపరేషన్లు సహితం చేయించామని, సేవలో భాగంగానే మంగళవారం రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్త దాన శిబిరం ఏర్పాటుచేసి 35 యూనిట్స్ బ్లడ్ సేకరించి, రెడ్ క్రాస్ సొసైటీ టెక్నికల్ సూపర్ వైజర్ విజయ్ కుమార్ కు అందజేశామన్నారు .ఇక ముందు దాతలు ముందుకొస్తే సమాజానికి ఉపయోగపడే, మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ దుద్దిళ్ల నారాయణ రావు మాట్లాడుతూ క్లబ్ ప్రారంభం అయిన తక్కువ రోజుల్లోనే ఒకటి కంటి అపరేషన్ శిబిరం, రక్త దాన శిబిరం ఏర్పాటు చేయడం పట్ల క్లబ్బు సభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని కోరారు. ఆపద కాలంలో రక్తం అందక ఎంతో మంది ఇబ్బ%శీ%ది పడుతున్నారని అదేవిదంగా తలసేమియా వ్యాది ఉన్న వారికి ఇలాంటి రక్త దాన శిబిరం చాలా ఉపయోగ పడుతుందని, క్లబ్ సభ్యులు అందరూ కలిసి కట్టుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైనజడ్పీటీసీ సాలిగామ బాణయ్య, ఎంపీటీసీలు. రజిత ,సిరంగి శంకర్,సింగల్ విండో ఛైర్మెన్ ఎస్. దత్తుమూర్తి ,లయన్ , ఎస్.మహేందర్ రావు ,మాజి జడ్పీటీసీ మంగపతి సురేష్,లను క్లబ్ సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ లయన్ బండి సత్యనారాయణ,కోశాధికారి కటకం గట్టయ్య, ఉపాధ్యక్షుడు చౌటపల్లి రంగారావు, ఎల్కా రామచందర్, మద్దిబోయిన గోపాల్, పెరిక రాజన్న, గాజుల రమేష్. ఐడిదినేని సత్యనారాయణ, రాపెల్లి ఈశ్వరయ్య , రహేమత్ ఖాన్, శ్రీనివాస్, పిట్టల వేణు, దుర్గ చరణ్ , ఉప్పట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 56 మంది రైతులకు రూ 28 లక్షలు రుణాలు: బోనకల్ పిఎసిఎస్ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు



బోనకల్, అక్టోబర్ 4 ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో మంగళవారం 56 మంది నూతన సంఘ సభ్యులకు రూ. 28 లక్షల రుణాలను డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ షేక్. షిరిన్ తో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల అభ్యున్నతి కోసం సంఘ పరిధిలోని చిరునోముల గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ కు నాబార్డ్ నిధులను మంజూరు చేసిందని త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. బోనకల్ సొసైటీ పరిధిలోని అన్నదాతలు ప్రభుత్వం రాయితీలపై అందించే ఎరువులను సహకార సంఘాల లోనే కొనుగోలు చేసి సంఘం బలోపేతానికి కృషి చేసి రానున్న రోజుల్లో ప్రభుత్వం అందించే రుణాలను ఎక్కువ మొత్తంలో పొందాలన్నారు. బోనకల్ సొసైటీ ద్వారా గోల్డ్ లోన్ డిపాజిట్ సౌకర్యమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బోనకల్ బ్రాంచ్ మేనేజర్ షేక్ షిరిన్, సూపర్వైజర్ షేక్ బాజీ సీఈఓ, మండే వెంకటేశ్వరరావు, స్టాఫ్ అసిస్టెంట్ అంబటి సంపత్, ఉప సర్పంచ్ యార్లగడ్డ రాఘవ గౌడ్ సహకార సంఘం డైరెక్టర్లు గుండపనేని సుధాకర్ రావు గంగుల పుల్లయ్య, నందమూరి సత్యనారాయణ, మోర్ల శీను, సంఘం సిబ్బంది, సభ్యులు, నిమ్మతోట ఖానా, వరుగు. ఐతంరాజు, మరీదు, అంజి, యార్లగడ్డ సుజాత, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట మండల పరిషత్ కార్యాలయ రాత్రి కాపలా దారుడు పిలక కృష్ణ అకాల మరణం



యాదాద్రి భువనగిరి జిల్లా 4 ప్రజాపాలన:రాత్రి కాపాలదారుడు పిలక కృష్ణ అకాల మరణం చెందారు. యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాత్రి కాపలా దారుగా (నైట్ వాచ్ మెన్) పనిచేస్తున్న పిలక కృష్ణ మంగళవారం నాడు అకాలమరణం చెందాడు. యాదగిరిగుట్ట మండలం పరిషత్ కార్యాలయంకు రాకపూర్వం భువనగిరి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఇంజనీర్ కార్యాలయంలో పనిచేశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డివిజన్ కార్యాలయంలో పలువురి అధికారుల ప్రశంసలను అందుకున్నారు. రాత్రి కాపలా దారుడు పిలక కృష్ణ అకాలమరణానికి పలువురు అధికారులు స్నేహితులు బంధువులు ప్రగాఢ సంతాపం తెలిపారు. తనతో గడిపిన క్షణాలను అధికారులకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. బొమ్మల రామారం మండల ప్రజా పరిషత్ పర్యవేక్షకులు గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... కృష్ణ అందరితో ఎంతో ఆత్మీయంగా మెలిగేవాడని తనతో ఉన్న అనుబంధం గడిపిన క్షణాలను గుర్తు తెచ్చుకుంటూ కళ్లు చెమర్చాయి. మోత్కూర్ మండల సీనియర్ అసిస్టెంట్ యస్.రాంరెడ్డి మాట్లాడుతూ భువనగిరి ఇంజనీరింగ్ డివిజన్ కార్యాలయంలో మరియు యాదగిరిగుట్ట లో పని చేసే రోజుల్లో కృష్ణ తో ఎక్కువ అనుబంధం ఉందన్నారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంజయ్య తాల్క మాట్లాడుతూ... కృష్ణ ఎంతో ఆత్మీయంగా మెలిగేవాడని అందరి మన్ననలను పొందేవారు అని అన్నారు. కృష్ణ అకాలమరణం తీవ్ర మనస్థాపానికి గురిచేసిందన్నారు. పిలక కృష్ణ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనుంజయ రెడ్డి సిబ్బంది కాంట్రాక్టర్ లు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు కోరుకుంటున్నారు.

## ఆ 19 మున్సిపాలిటీలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు : మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సిరిసిల్ల, తుర్కయాంజాల్, గజ్వేల్, వేములవాడ, ఘట్కేసర్, కొంపల్లి, హుస్నాబాద్, ఆదిభట్ల, కొత్తపల్లి, చండూర్, నేరేడుచర్ల, చిట్యాల, భూత్పూర్, అలంపూర్, పీర్జాదిగూడ, కోరుట్లకు నిధులు మంజూరు చేయనున్నారు.

కేటీఆర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు సాధించిన వారికి అభినందనలు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు సాగాలన్నారు. దేశంలోనే అత్యధికంగా అవార్డులు సాధించి రెండవ స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. ఈ అవార్డులు సాధించేందుకు కింది స్థాయిలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలి నుంచి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దాక అందరూ కలిసి ఒకే రకమైన ఆలోచన విధానంతో పనిచేయడం వల్లనే సాధ్యమైనది. జాతీయస్థాయిలో ఇంత గొప్ప గుర్తింపు లభించిందని ప్రశంసించారు.

వారే అవార్డులు ఇస్తారు.. వారే విమర్శిస్తారు..

20 ఉత్తమ గ్రామాల్లో 19 తెలంగాణలోనే ఉన్నాయని కేంద్రం చెబుతున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. పట్టణాలకు అవార్డులు ప్రకటిస్తే దేశంలో రెండో స్థానంలో తెలంగాణలో నిలిచింది. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోకెల్లా అత్యుత్తమమైన రాష్ట్రం తెలంగాణ అని కేంద్రమే చెబుతుంది. కానీ ఇక్కడ పరిపాలన సరిగా లేదని అబద్దాలను చెబుతుంది కూడా కేంద్రంలోని నాయకులే. అయితే ఇలాంటి అర్థరహిత విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒకవైపు అవార్డులు, రివార్డులతో పాటు ప్రజల ప్రశంసలు వస్తున్నాయని పేర్కొన్నారు.

జపాన్, సింగపూర్కు స్టడీ టూర్కు పంపిస్తాం..

తెలంగాణలో స్థానిక సంస్థల విధులను నిర్ణయించడం, నిధులు మంజూరు చేయడం వల్లనే ఇంత ప్రగతి సాధ్యమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో, మునిసిపాలిటీలో నర్సరీ ఉన్న ఏకైక రాష్ట్రము తెలంగాణ అని గర్వంగా చెప్పవచ్చు. ఈ రోజు తెలంగాణలోని పట్టణాలు, గ్రామాలు గొప్పగా మారాయి. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ వల్ల ఎంతో మంది అద్భుతమైన మహిళా నాయకులు పురపాలికలకు నాయకత్వం వహిస్తున్నారని గుర్తు చేశారు. అవార్డులు సాధించిన ఈ 19 పూరపాలికలకు చెందిన చైర్పర్సన్లను, కమిషనర్లను, అడిషనల్ కలెక్టర్లను స్టడీ టూర్కు పంపించి, మరిన్ని ఉత్తమ పద్ధతులపైన అధ్యయనం చేసేందుకు అవకాశం కల్పిస్తాం. ఇందులోంచి పదిమందిని ఎంపిక చేసి జపాన్, సింగపూర్ కు అధ్యయనానికి పంపిస్తామని కేటీఆర్ తెలిపారు. పట్టణాలను ప్రజలు మాది అని భావించినప్పుడే అవి అద్భుతంగా అభివృద్ధి సాధిస్తాయి. ఆ దిశగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలని కేటీఆర్ సూచించారు.

## హామీల అమలుకు నిధులు ఎలా?

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల సుప్రీంకోర్టు రాజకీయ పార్టీల మేనిఫెస్టోలపై మార్గదర్శకాలను రూపొందించే అంశాన్ని పరిశీలించాలంటూ ఎన్నికల కమిషన్కు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. సుప్రీం ఆదేశాల నేపథ్యంలోనే తాజా కసరత్తును చేపట్టినట్లు ఇసి తెలిపింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత తమపై ఉందని, దానిలో భాగంగా ఓటర్లు ఎటువంటి భయం, ఆకర్షణ, ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని ఇసి పేర్కొంది. మ్యానిఫెస్టోలు వాస్తవికంగా ఉండాలని, నెరవేర్చడానికి సాధ్యమయ్యే హామీలనే పేర్కొనాలని తెలిపింది. ఓటర్లను ప్రలోభ పరిచే వాగ్దానాలు చేయడం మానుకోవాలని సూచించింది. దీనిని దృష్టిలో ఉంచుకునే చేసిన వాగ్ధానాల అమలుకు సంబంధించిన సమస్యలను, ఆర్థిక వనరల లభ్యత, నెరవేర్చడానికి అయ్యే ఖర్చులను, ఆ మొత్తాన్ని సేకరించడానికి ఉన్న మార్గాలను తెలియచేయాలని పేర్కొంది.

## రాజకీయాల కోసం మాట్లాడే వారికి సమాధానం ఇవ్వం


(మొదటి పేజీ తరువాయి)

బాగుందని కేంద్రం అవార్డులు ఇస్తుంటే.. బీజేపోళ్లు విమర్శిస్తున్నారని తెలిపారు. రాజకీయాల కోసం మాట్లాడే వారికి సమాధానం ఇవ్వమన్నారు. అనవసర విషయాలు పట్టించుకోకుండా పని చేసుకుంటూ పోవాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు సాధించిన 19 మున్సిపాలిటీలకు రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ నిధులను ప్రత్యేకంగా పారిశుధ్యం కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నానని కేటీఆర్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు%--%2022 సాధించిన మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, కమిషనర్ల అభినందన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అలయ్ బలయ్ కు అహ్వానాలు

హైదరాబాద్, అక్టోబరు 4, :అలయ్ బలయ్” కి ఆహ్వానాలు పంపారు బండారు దత్తాత్రేయ. విజయదశమి సందర్భంగా అందరు కలుసుకొని ఆత్మీయంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొనే కార్యక్రమమే ఈ అలయ్ బలయ్. హర్యానా బండారు దత్తాత్రేయ తెలంగాణ ఉద్యమ నేపథ్యం లో తెలంగాణ సమాజంలో అనేక వైరుధ్యాల భిన్న అభిప్రాయాలూ కలిగిన వారిని ఏకం చేసే కార్యక్రమంగా దీన్ని ప్రారంభించిన సంగతి అందరికి విదితమే. తెలంగాణ ఉద్యమ సమయం లో అలయ్ బలయ్ కార్యక్రమం ఉద్యమానికి ఊపునిచ్చింది. ఉద్యమకారులందరికి ఒక వేదికనిచ్చింది. యువతకు మనోధైర్యాన్నిచింది. సకలజనులకు ఒక భరోసానిచ్చి, రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించింది. ఏడాది మొత్తం రాజకీయాల్లో ఎంతో బిజిగా ఉన్న వివిధ పార్టీల నేతలను కార్యకర్తలను పార్టీల బేదాభిప్రాయాలు పక్కన పెట్టి ఆత్మీయంగా కలుసుకొని ఉల్లాసంగా గడిపే ఒకమంచి సంప్రదాయానికి ప్రతీక ఈ అలయ్ బలయ్. దత్తాత్రేయ ఈ అలయ్ బలయ్ ని ఒక ఉద్యమ దీక్షుచిగా , రాష్ట్ర సాధనకు సాధనంగా వినియోగిస్తూనే అన్ని పార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి నాంది పలికారు. గత 17 ఏండ్లనుండి తెలంగాణ ఆనవాయితీగా, సంప్రదాయచిహ్నంగా జరుగుతున్న ఈ కార్యక్రమం ఈ సంవత్సరం మరింత వైభవంగా నిర్వహించాలని భావిస్తున్నామని నిర్వహకులు పేర్కొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో జెట్ స్పీడ్ తో రియల్ భూమ్



మంచిర్యాల :ఒకనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల అదిలాబాద్ జిల్లాలో భాగమైన నేటి మంచిర్యాల జిల్లా లోని పలు పట్టణాల శివార్ల పరిధిలో గల భూములను అలనాడు పట్టించుకునే వారే కరువు, కానీ తెలంగాణ ఆవిర్భావం అనంతరం జిల్లాల పునర్విభజనలో భాగంగా 2016 లో మంచిర్యాలను జిల్లా కేంద్రంగా ప్రకటించడం,నాలుగు వరసల జాతీయ రహదారి పనులు వేగిరంగా పూర్తి కావస్తుండడంతో, అంతే వేగంగా జిల్లాలో జెట్ స్పీడ్ తో రియల్ భూమ్ నడుస్తోంది. జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు,ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.ఒక నాడు స్కూటర్ పై వచ్చిన కొందరు స్థిరాస్థి వ్యాపారులు నేడు కోట్లాది రూపాయల వాణిజ్య వ్యాపార సంస్థలకు అధిపతులుగా ఉన్నారంటేనే మనం ఇట్టే అర్థం చేసుకోవచ్చు జిల్లాలో ఏ స్థాయిలో స్థిరాస్తి వ్యాపారం జరుగుతుందో.ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలల్లోనే ఏ జిల్లాకు లేని ప్రత్యేకతలు మంచిర్యాల జిల్లాకు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. భౌగోళికంగా ఈ జిల్లా ఉత్తర తెలంగాణలో ఉంది. జిల్లా యొక్క ప్రత్యేకతల గురించి ఎంత చెప్పినా తక్కువే అని చెప్పవచ్చు. తూర్పున మహారాష్ట్ర, ఉత్తరాన కొమరం భీం జిల్లా , దక్షిణాన పెద్దపల్లి జిల్లా ,ఆగ్నేయాన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పశ్చిమాన నిర్మల్ జిల్లా, నైరుతిన జగిత్యాల జిల్లాలు కలవు. జిల్లా యొక్క దక్షిణ సరిహద్దు గుండా గోదావరి ప్రవహిస్తుండడంతో పాటు అతి సమీపంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉండడంతో తాగునీరుకు, సాగునీరుకు కొదవలేదని చెప్పవచ్చు. ఇవే కాకుండా జైపూర్ వద్ద 1200 మెగావట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం రన్ అవుతుండగా,మంచిర్యాల పట్టణంలో సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు చిన్న , మధ్యతరగతి పరిశ్రమలు సైతం నడుస్తున్నాయి. దీనికి తోడు జిల్లా వ్యాప్తంగా శతాబ్దం పైబడి కాలం నుండే ఇక్కడ ఎన్నో సింగరేణి భూగర్భ గనులతో విలసిల్లుతున్న ప్రాంతమనే విషయం మనకు తెలిసిందే. 2016 అక్టోబర్ 11 నాడు జిల్లాల పునర్విభజనలో భాగంగా మంచిర్యాల పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించడంతో భారీ స్థాయిలో వ్యాపార ,వాణిజ్య సముదాయాలు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. ముఖ్యంగా కార్పొరేట్ షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్, ఫర్టిలైజర్స్, విద్యాసంస్థలతో పాటు ప్రతి రంగానికి చెందిన హోల్ సెల్ వ్యాపార సముదాయాలు పెద్ద ఎత్తున వెలిశాయి.ఇక్కడ కొనుగోళు జరపడానికి పక్క జిల్లాల ప్రజలే గాకా, జిల్లాకు ఆనుకొని ఉన్న సరిహద్దు పొరుగు రాష్ట్రాలు ఐన మహారాష్ట్ర , చత్తిస్ గడ్ , మధ్యప్రదేశ్ , ఒరిస్సా రాష్ట్రాల నుండి సైతం ప్రజలు పెద్ద ఎత్తున రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు .మెడికల్ ఎమర్జెన్సీ నుండి మొదలుకొని ఫర్టిలైజర్ వరకు ఈ జిల్లా పైనే ఆధారపడుతుంటారు . దీంతో మంచిరాల జిల్లా కేంద్రంలో ఏ వ్యాపార సముదాయం పెట్టిన ముందడుగే కానీ , వెనకపట్టు పట్టిన సందర్భాలు మనకు కనబడవు. దీంతో ఉద్యోగరీత్యా ఇతర ఏ జిల్లాలోనైన ఉన్నప్పటికీ వారి యొక్క స్థిర నివాసాన్ని మంచిర్యాల జిల్లాలోని ఏర్పాటు చేసుకోవడానికి సుముఖత, ఆసక్తి కనబరుస్తున్న ప్రత్యేకత విషయం మనకు విదితమే.జిల్లాకు ఉన్న ప్రత్యేకతల వల్ల ప్రజలంతా మంచిర్యాల జిల్లాకు " క్యూ "కడుతున్నారు.కొందరు స్థిర నివాసం దృష్ట్యా భూములను కొనుగోలు చేస్తూ ఉంటే , మరి కొందరు భవిష్యత్తులో భూముల ధరలు పెరిగి , మంచి రిటర్న్ వస్తాయని భూములపై పెట్టుబడులు పెడుతుండడం మనకు కనిపిస్తోంది.ముఖ్యంగా జిల్లా కేంద్రం అయినా మంచిర్యాల పట్టణంలో నార్త్ ఇండియా నుంచి సౌత్ ఇండియాకు అనుసంధానం చేసే రైల్వే మార్గం ఉండడం కలిసివచ్చే అంశంగా చెప్పవచ్చు.4016చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో జిల్లా కలదు. జిల్లాలో 1761.17 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం ఉంది. జిల్లాలో పలు రకాల రోడ్ల మొత్తం పొడవు 2900 కిలోమీటర్లు కాగా ఇందులో రాష్ట్ర రహదారులు 111 కిలోమీటర్ల మేర కలవు. ఇవే కాకుండా జిల్లా పొడవున 26 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ లు ఉండగా , 5 రైల్వేస్టేషన్ లు ఉన్నాయి. మిగతా ఏ జిల్లాకు కూడా ఇంతటి సంపూర్ణంగా రైల్వే లైన్ సౌకర్యాలు లేవు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్, బెంగళూరు లాంటి తదితర మహా నగరాలకు ప్రయాణికులను చేరవేసేందుకు భారీ బస్ డిపో అందుబాటులో ఉంది.ఈ బస్ డిపోలో 144 బస్సులు ఉండగా , అవి ప్రతి దినం 58,603 కిలోమీటర్ల మేరకు ప్రయాణించి ప్రజల్ని వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తూ ఉంటాయి. ఇలా అన్ని అనుకూలతల దృష్ట్యా పైసాకు పనికిరాని నాడు హడావు పడ్డ భూములే, నేడు కోట్లాది విలువ చేస్తూ హాట్ కేకుల్లా మారిపోయాయి. ఒకనాడు గజానికి వందలల్లో పలికిన ధర నేడు వేళల్లో ,లక్షల్లో పలకడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ముఖ్యంగా మంచిర్యాల పట్టణంలో భూతద్దం పెట్టి వెతికిన అమ్మకానికి అంగుళం భూమి దొరకని పరిస్థితి తలెత్తింది. దీంతో అనివార్యంగానే రియల్టర్ల కన్ను మంచిర్యాలకు అన్ని దిశలలో అనగా 40 కిలోమీటర్ల మేరకు పడవుగా ఉన్న భూములపై పడింది. జిల్లా కేంద్రం మంచిర్యాల నుండి ఇటు తాండూర్ వరకు,అటు చెన్నూరు వరకు, ఇకపోతే అటు లక్షెట్టిపేట వరకు ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఖాళీ భూముల్ని నేడు లేఅవుట్ లుగా మార్చి ప్లాట్ల దందా ను జోరుగానే కొనసాగిస్తున్నారు. ఒకనాడు మంచిర్యాల బస్టాండ్ నుండి ఇటు లక్ష్మి థియేటర్ వరకు, అటు ఐబి చౌరస్తా వరకు మాత్రమే మంచిర్యాల పట్టణం విస్తరించి ఉండేది. కానీ లక్ష్మీ థియేటర్ సమీపాన ఉన్న కాళీ జాగాలో పెద్ద ఎత్తున హైటెక్ సిటీ నిర్మాణం చేపట్టడంతో ఒక్కసారిగా మంచిర్యాల పట్టణము యొక్క రూపురేఖలే మారిపోయాయి. అనంతరం ఇంకా కాస్త ముందుకు వచ్చి అమ్మ గార్డెన్ సమీపంలో ప్లాట్లను ఏర్పాటుచేశారు. ఇందులోని ప్లాట్లన్ని అతి స్వల్పకాలిక సమయంలోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.మంచిర్యాల బస్టాండ్ సమీప ప్రాంతంలో గజానికి ఒక లక్ష 50 వేల ధర పలుకుతుండడం బట్టే మనం అర్థం చేసుకోవచ్చు ,మంచిర్యాల భూములకు ఎంత క్రేజ్ ఉందో. దీంతో కస్టమర్ల అభిరుచులను పసిగట్టిన రియల్టర్లు ఇటు తాండూర్,అటు జైపూర్ వరకు జాతీయ రహదారికి ఆనుకుని ఎక్కడ" జాగా" కనబడిన బేరం పెడుతూ వచ్చారు. అట్టి భూములన్నింటిని ప్లాట్లుగా మార్చి కస్టమర్లకు అందుబాటులో ఉంచారు. దీంతో మంచిర్యాల పట్టణంలో స్థిర నివాస స్థలాన్ని కొనుగోలు చేయలేని వారు ఈ ప్లాట్లను కళ్ళకు అద్దుకొని కొన్నారు,కొనుక్కుంటున్నారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా సింగరేణి కార్మిక వర్గం ఉంటుంది. వీరికి వన్ టైం సెటిల్మెంట్ కింద కొనుగోలు చేసే శక్తి సామర్థ్యాలు లేనప్పటికీ , ఆయా బ్యాంకు లోన్ల ద్వారా "ఈ ఎం ఐ" పద్ధతి లో అత్యధిక ప్లాట్లను, గృహ సముదాయాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రియల్టర్లకు కాసుల వర్షం కురుస్తుంది.ఇక మంచిర్యాల చుట్టపక్కల రియల్టర్లు మట్టి ముడితే బంగారం అవుతుంది అనే చర్చ నడుస్తోంది. మంచిర్యాల నుండి జైపూర్ వరకు కన్నెత్తి చూడని ప్రజానీకం ఇప్పుడు ఆ వైపు ప్లాట్లను కొనుగోలు చేయడానికి ఎగబడుతున్నారు. అందుకు బలమైన కారణాలు లేకపోలేదు. సీసీ,నస్పూర్ ఏరియాలలో కలెక్టరేట్ , కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయులు ఏర్పడడం వంటివి. ఇవే కాకుండా నాలుగు వరుసల జాతీయ రహదారి మార్గం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుండి రామకృష్ణ పూర్ మీదుగా బయల్దేరి మంచిర్యాల టు మహారాష్ట్ర ప్రధాన రహదారికి అనుసంధానం కావడం, శ్రీరాంపూర్ లోని అరుణక్క నగర్ లో గల భూములలో నివాసం ఉంటున్న వారికి ముఖ్యమంత్రి పట్టాలు మంజూరు చేయడం మరో ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దీంతో ఎట్లెట్ల నాలుగు వరసల రహదారి వచ్చిందో అట్లట్ల పడావు పడ్డ" చేను భూములు " ఖరీదైన ప్లాట్లుగా మారిపోయాయి. చివరికి రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ లో తీసిన ఓవర్ బర్డెన్ ఓబి గుట్టల కింద సైతం బహుళ అంతస్తుల నిర్మాణాలు జరిపి కస్టమర్ల ను ఒప్పించి, మెప్పించి అంటగడుతున్నారు. ఇదేమిటని ఆరా తీస్తే ఆర్కేపి ఓపెన్ కాస్ట్ శాశ్వతంగా ఉండక పోవడం ఒక కారణమైతే, ఈ వైపు గానే నాలుగు వరుసల జాతీయ రహదారి రావడమే మా యొక్క ఆసక్తికి ప్రధాన కారణమని చెబుతున్నారు. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల దూకుడును గమనిస్తే ,రానున్న రోజుల్లో మంచిర్యాల జిల్లా కేంద్రానికి ఎటు 25 కిలోమీటర్ల మేర ఉన్న పట్టణాలను కలుపుకొని మహానగరంగా అవతరించడం ఖాయం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.


## డీజీపీ దారుణ హత్య.. ఇంట్లోనే మృతదేహం తగలబెట్టే యత్నం

### పని మనిషిపైనే అనుమానం..పరారీలో నిందితుడు

జమ్మూ :జమ్ములో జైళ్ల శాఖ అడిషన్ డైరక్టర్ జనరల్ హేమంత్ కుమార్ లోహియా(57) దారుణ హత్యకు గురయ్యారు. ఇంటి పని మనిషే డీజీని గొంతు కోసి, హత్య చేసి ఉంటాడని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. తరువాత నిందితుడు మృతదేహాన్ని దహనం చేసేందుకు ప్రయత్నించాడని వివరించారు. అనుమానితుడు పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు చేపట్టామని జమ్ము జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ముకేశ్ సింగ్ వెల్లడించారు. ఘటన జమ్మూలోని ఉదయవాల ప్రాంతంలో డీజీ నివాసంలో జరిగింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అదేరోజు కాశ్మీర్ లో పర్యటించారు.

# విపక్షాల అనైక్యతే కమల బలం

న్యూఢిల్లీ, అక్టోబరు 4, :2024 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఓడించాలి, మోడీని గద్దె దించాలి. కురువృద్ధ కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు సోనియా గాంధీ మొదలు రేపో మాపో జాతీయ రాజకీయాల్లో అడుగు పెడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వరకు బీజేపీ ప్రత్యర్థి పార్టీల నాయకులు అందరిదీ అదే మాట. అందుకోసమే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, 'భారత్ జోడో' యాత్ర చేస్తున్నారు. అందుకోసమే, కమ్యూనిస్టులు ఎవరితో అంటే వారితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నారు. శరద్ పవార్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ ఎవరి శక్తి కొలది వారు ప్రయత్నిస్తున్నారు. ఎవరి వ్యూహాలు వారు రచించుకుంటున్నారు. మరోవంక, బీజేపే వ్యతిరేక పార్టీల నేతలు అందరినీ రింగ్ మాస్టర్ లా ఆడిస్తున్న, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కూడా అదే ధ్యేయంతో బీహార్ లో పాద యాత్ర ప్రారంభించారు. 2024 ఎన్నికలకు ఇంకా చాలా దూరముంది. అంతకంటే ముందుగా తెలంగాణ సహా మరో ఐదారు రాష్ట్రాల శాసన సభ ఎన్నికలున్నాయి, ఈ ఎన్నికలు 2024 సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్ గానూ భావిస్తునారు. అందులోనూ ఇప్పుడు గుజరాత్ హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముందు వరసలో ఉన్నాయి.మరో రెండు నెలల్లోనే ఈ రెండు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.ఈ రెండు రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో వుంది. ఈ రెండు రాష్ట్రాలలో బీజేపీ మళ్ళీ అధికారంలోకి రాకుండా అడ్డుకోగలిగితే 2024 లోక్ సభ ఎన్నికలపై, విపక్షాలు ఆశలు పెట్టుకోవచ్చని రాజకీయ పండితులు విశ్లేస్తున్నారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ లో బీజేపీని ఓడించే స్థితిలో ప్రతిపక్ష పార్టీలున్నాయా? అంటే, రాజకీయ విశ్లేషకులే కాదు, వివిధ సంస్థలు నిర్వహిచిన సర్వేలు కూడా లేదనే అంటున్నాయి. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రెండు రాష్ట్రాలలోనూ మళ్ళీ బీజేపీదే గెలువని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.ఇప్పటికే, వేరు వేరు సంస్థలు నిర్వహించిన సర్వేలు అదే చెప్పాయి. ఇప్పుడు తాజాగా, ఏబీపీ న్యూస్–సీఓటర్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ కూడా రెండు రాష్ట్రాల్లో మరోసారి బీజేపీదే గెలుపని తేల్చి చెబుతున్నది. ఏబీపీ న్యూస్–సీఓటర్ ఒపీనియన్ పోల్ ప్రకారం గుజరాత్ అసెంబ్లీలో ఎన్నికలలో బీజేపే అధికారాని నిలబెట్టుకోవడమే కాకుండా, గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని పేర్కొంది. గత ఎన్నికలలో బీజేపీ అతికష్టం మీద మొత్తం 182 స్థానాలకు గానూ 99 స్థానాలలో గెలిచి పరువు నిలుపుకుంది. అయితే ఈసారి 135 నుంచి 143 వరకు స్థానాల్లో బీజేపీ గెలిచే అవకాశం ఉందని ఒపీనియన్ పోల్ పేర్కొంది. కాంగ్రెస్‌కు 36 నుంచి 44 స్థానాల వరకు సీట్లు దక్కవచ్చని ఒపీనియన్ పోల్ అంచనావేసింది. అలాగే 68 స్థానాలున్న హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ 37–45 సీట్లలో విజయం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందని ఒపీనియన్ పోల్ తెలిపింది. ఒపీనియన్ పోల్స్ తోపాటుగా గుజరాత్ లో చోటు చేసుకుంటున్న పరిణామాలను విశ్లేషించినా బీజేపీ విజయం ఖాయంగానే కనిపిస్తోందని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ కొంత బలంగా ఉంది. బీజ్పీకి గట్టి పోటీ ఇచ్చింది. కానీ గడచిన ఐదేళ్ల కాలంలో ముఖ్యంగా అహ్మద్ పటేల్ కన్ను మూసిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కు లేకుండా పోయింది.అంతే కాకుండా పటేదార్ ఆందోళనతో ఫేమ్ లోకి వచ్చిన యువనేత, గుజరాత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హార్థిక్ పటేల్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి, బీజేపీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకత్వ సమస్యను ఎదుర్కుంటోంది. ఇది హస్తం పార్టీ నేతలను కలవరపెడుతోంది. మరోవంక, పంజాబ్ లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించిన ఆమ్ ఆద్మీ గుజరాత్ లోనూ కాంగ్రెస్ ఓటుకు గండి కొడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. వరసగా ఆరు పర్యాయాలు అధికారంలో ఉన్న బీజేపీకి సహజంగానే రాష్ట్రంలో కొంత వ్యతిరేకత ఉంది, అయితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య చీలిపోవడంతో అది బీజేపీకి మేలు చేస్తుందని అంటున్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలోనూ సమర్థ నాయకత్వం లేకపోవడం మైనస్ పాయింట్‌గా మారిందని అంటున్నారు,. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర గుజరాత్ లో సాగితే కాంగ్రెస్ పార్టీకి కొంత ప్రయోజనం ఉంటుందని స్థానిక నాయలు ఆశించారు.అయితే, రాహుల్ యాత్ర రూట్ మ్యాప్ లో గుజరాత్', హిమాచల ప్రదేశ్ రాష్ట్రాలను చేర్చలేదు. దీంతో, గుజరాత్,హిమాచల్ అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ ఆశలు వదులుకుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో, రాహుల్ యాత్ర వలన వస్తుందనుకున్న మైలేజి రాకపోగా నెగటివ్ ప్రచారానికి అవకాశం ఇచ్చిందని స్థానిక నాయకులు భావిస్తున్నారు. దీనికి తోడు ఆమ్ ఆద్మీ పార్టీకి గుజరాత్‌లో ఆదరణ పెరుగుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినాయకుడు, అరవింద్ కేజ్రీవాల్ వారంలో రెండు సార్లు ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. బహిరంగ సభలు, రోడ్ షోలతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని రాజకీయ పండితలు చెబుతున్నారు. హిమాచల్ ప్రదేశ్ లోనూ అదే పరిస్థితి, కనిపిస్తోంది. అందుకే బీజేపీ వ్యతిరేక పార్టీలు, 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించడం ఇప్పటికైతే, అయ్యే పని కాదనే అనిపిస్తోంది. అయితే, రాజకీయాలలో ఎప్పుడైనా, ఏదైనా జరగ వచ్చును.

# ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 05, అక్టోబరు 2022


## రాష్ట్రం బండి కదిలేది కేంద్రం తోస్తేనే...!

కేంద్రం రాబోయే ఆరునెలల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద అలవి మాలిన 'ఆర్థిక ప్రేమ' చూపిస్తుందా? ఇదే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖ వర్గాలకే కాదు, తల పండిన ఆర్థికవేత్తల ఎదుట కూడా ఉన్న ప్రశ్న! ఒకవేళ అలాంటి ఆర్థిక ప్రేమ కేంద్రం చూపించకపోతే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాబోయే ఆరు నెల పాటు, ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక బండి నడవాలంటే, అది కేవలం కేంద్రం దయాదాక్షిణ్యాలపై మాత్రమే ఆధారపడి ఉంది. ఏ రాష్ట్రానికీ ఇవ్వనంతటి కరుణ మన మీద చూపిస్తేనే రాష్ట్ర ఆర్థిక బండి నడుస్తుంది. వేరొక దారి కనపడటం లేదు.కేంద్రం కరుణ చూపించటం అంటే, ఆంధ్ర రాష్ట్రానికి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)తో సంబంధం లేకుండా, దేశంలో ఏ రాష్ట్రానికి కూడా ఇవ్వని వెసులుబాటు ఇచ్చి, ఇంకొక యాభై వేల కోట్లు అప్పు తెచ్చుకో పో, అని రాష్ట్రానికి పర్మిషన్ ఇస్తేనే రాష్ట్రం ముందుకు పోతుంది.అంటే కేంద్రం సాలుకు నిర్దేశించిన అప్పు తీసుకొన్న తర్వాత కూడా, నెలకు కనీసం అయిదు వేల కోట్ల రూపాయలు అప్పు చేస్తేనే కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక బండి ముందుకు పోవటం లేదు అన్నది స్పష్టం. మంగళవారం నాడు కూడా ఆంధ్రప్రదేశ్ మళ్ళీ రెండు వేల కోట్లు కావాలని ఆర్బీఐ దగ్గర ఇండెంట్ పెట్టింది. తీసుకోగలిగిన మార్కెట్ అప్పులు పరిధికి మించి ఎప్పుడో తీసేసుకున్నాము. కేంద్రం పెట్టిన తొమ్మిది నెల అప్పు పరిధిని ఆరు నెలల్లోనే దాటేసాము. దానికి తోడు కేంద్రానికి తెలియకుండా, మన ఎక్సైజ్ శాఖ నుంచి రాబోయే నెలల్లోని ఆదాయాన్ని బ్యాంకులకు తనఖా పెట్టి ఎనిమిది వేల కోట్లు తీసుకొన్నాం. ఇవి కాకుండా కేంద్రం నుంచి, నాబార్డ్ నుంచి వచ్చిన ఇంకొన్ని చిల్లర అప్పులు.రాబోయే ఆరు నెలలు ఆర్థిక బండి నడవటం ఎలా? కేంద్రం రాష్ట్రానికి 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ, ఏప్రిల్‌లో తొమ్మిది నెలలకు రూ.43,803 కోట్లు బహిరంగ మార్కెట్ ఋణాలకు అనుమతించింది. రాష్ట్రం ఆరు నెలల్లోనే రూ.51,100 కోట్లు అప్పు చేసింది. అంటే ఇప్పటికే తొమ్మిది నెలల అప్పు అనుమతిని, ఆరునెలల్లోనే దాటేసింది, పైగా ఏడు వేల కోట్ల రూపాయల అప్పు అదనంగా చేసింది.ప్రతి నెల కనీసం ఆరేడు వేల కోట్లు అప్పు తేలేకపోతే, రాష్ట్ర ఆర్థిక బండి ముందుకు నడవటం లేదు. ఎందుకు నడవటం లేదు, ఎందుకు అప్పులు కచ్చితంగా తేవాల్సిన పరిస్థితి ఎదురయ్యింది అంటే మన రాష్ట్ర ఆదాయానికన్నా, రాష్ట్రం పెట్టే ఖర్చు రెండింతలు ఉంది కాబట్టి. ఆగస్టు వరకు రాష్ట్ర స్వంత ఆదాయం, కేంద్ర పన్నుల వాటాతో కలిపి రూ.45,190 కోట్లు. చేసిన అప్పు రూ.44,582 కోట్లు. అంటే ఎంత సంపాదిస్తే అంత మొత్తాన్ని అప్పుగా తెచ్చామన్నమాట. మరొక చిత్రమేమిటంటే, ఆగస్టు వరకు రాష్ట్రం ఆదాయం%--% కేంద్ర పన్నులు, గ్రాంటులు, స్వంత ఆదాయం అన్నీ కలుపుకొని, రూ.59,381 కోట్లు. ఖర్చు మాత్రం రూ.1,03,975 కోట్లు. నలభై అయిదు వేల కోట్లు లోటు. మరెలా అంటే నలభై అయిదు వేల కోట్లు అప్పుచేసి బండిని లాగారు. కేంద్రం ఆగస్టు వరకు తీసుకోవచ్చని చెప్పిన అప్పు, కేవలం ఇరవై నాలుగు వేల కోట్లు మాత్రమే. ఆగస్టు వరకు చేసిన అప్పు, రూ.నలభై అయిదు వేల కోట్ల పైచిలుకు. అంటే కేంద్ర అనుమతి లేకుండా అయిదు నెలల్లోనే రాబోయే కాలానికి తీసుకోవాల్సిన అప్పుని ముందే తీసుకొన్నారు.ఇక్కడ కేంద్రం నిర్ణయం కీలకం. ఎందుకంటే, రాష్ట్రాలు ఎంత అప్పులు తీసుకోవాలో నిర్ణయించేది రాజ్యాంగం ప్రకారం కేంద్రమే. రాష్ట్రాల స్థూల ఉత్పత్తిని, ఇప్పటికి ఉన్న అప్పుల పరిమాణాన్ని ఆధారంగా చేసుకుని కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంటుంది. అప్పుల విషయంలో కేంద్రం రాష్ట్రానికి ఏమి చెబుతుంది? 'నువ్వు చెయ్యాల్సిన అప్పు ఇరవై తొమ్మిది వేల కోట్లే అయినప్పటికీ, ఆరునెలల్లో ఇప్పటికి యాభై వేల కోట్లు పైనే అప్పు చేసావు, అయినా ఫర్లేదులే, రాగల ఆరు నెలల్లో ఇంకొక యాభై వేల కోట్లు అప్పు చేసుకోలే, నేను చూసుకొంటాలే' అని ఊరడిస్తుందా? లేక, 'నీది సవ్యమైన ఆర్థిక విధానం కాదు, నీ ప్రాధామ్యాలు సరి చూసుకో, ఇంతకంటే అప్పులు చేయడానికి వీల్లేదు' అని కరాఖండిగా చెప్తుందా? పైపెచ్చు, క్రితం వారం కేంద్రం తీసుకొన్న నిర్ణయం ప్రకారం, రాగల ఆరు నెలల్లో బహిరంగ మార్కెట్ నుంచి కేంద్రం తీసుకోదల్చుకున్న అప్పుల్లో కొంత మేర కోత వేయాలని నిర్ణయించింది. ఎందుకంటే, గత నాలుగైదు నెలల్లో రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం రావడంతో, చేయాలి అనుకొన్న అప్పులని కొంత తగ్గించుకొంది. ఈ నేపథ్యంలో అత్యవసర ఖర్చులు కాకుండా తాను నిర్ణయించుకొని ఆ మేరకు ఇస్తున్న సబ్సిడీల కోసం, రాగల ఆరు నెలలకి దాదాపు యాభై వేల కోట్ల అప్పులను అదనంగా తెచ్చుకోమని, కేంద్రం రాష్ట్రానికి అనుమతిస్తుందా అన్నది ఒక క్లిష్టమైన ప్రశ్నే. పైగా, ఇది జాతీయ స్థాయిలో జరిగే విధాన నిర్ణయం. రేపటి నుంచి ప్రతి రాష్ట్రమూ, నాక్కూడా ఆంధ్రప్రదేశ్ పద్ధతిలో రాష్ట్ర జీఎస్డీపీలో అనుమతించినమేర కంటే ఎక్కువ మార్కెట్ ఋణాలు కల్పించమని పోటీ పడితే, కేంద్రం అనుమతించే పరిస్థితి ఉంటుందా? క్రిందటి ఆర్థిక సంవత్సరంలో కూడా రాష్ట్రానిది ఇదే పరిస్థితి. కానీ కేంద్రానికి చెప్పకుండా, అనుమతించిన బహిరంగ మార్కెట్ ఋణాలతో పాటుగా, ఆంధ్రరాష్ట్రం తన స్వంత కార్పొరేషన్ల నుంచి బ్యాంకుల్లో అప్పులు తెచ్చేసుకొని నెట్టుకొచ్చింది. కేంద్రం విధించిన అప్పుల పరిమితి దాటలేదు అని వాదించింది. ఖంగుతిన్న కేంద్ర ఆర్థిక శాఖ, ఇక నుంచి రాష్ట్రాలు చేసే ఏ అప్పులైనా, కార్పొరేషన్లు, ఇతర రాష్ట్ర పబ్లిక్ సంస్థల అప్పులతో సహా ఆ ఆర్థిక సంవత్సరంలో ఆయా రాష్ట్రాలకు ఇచ్చే అప్పు పరిమితిలకు లోబడే ఉంటాయి అని మొన్నటి జూన్‌లో లోక్‌సభలో స్పష్టం చేసింది. ఆ మేరకు రాష్ట్రాల అకౌంట్లను ప్రచురించే 'కాగ్' ఫార్మాట్ లలో కూడా రాష్ట్రాల కార్పొరేషన్లు, పబ్లిక్ సంస్థల కోసం విడిగా సమాచార ఫార్మాటును ఏర్పరచింది.బహుశా ఈ పరిస్థితిని ఊహించేనేమో, కేంద్ర ఆర్థిక శాఖ ఆర్బీఐ ద్వారా, జూన్ నెలలో, శ్రీలంక ఆర్థిక సమస్య నేపథ్యంలో, రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య పరిస్థితి మీద ఒక సవివరమైన పరిశోధన పత్రం వెలువరించింది. ఆ పత్రం ప్రకారం, అప్పుల భారం అత్యధికంగా, రెవెన్యూ లోటు ఎక్కువగా (ఆగస్టు దాకా% 217 శాతం రెవెన్యూ లోటు), ఆదాయం – వడ్డీ చెల్లింపులు నిష్పత్తి 10శాతం కంటే దాటిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. పదిహేనవ ఆర్థిక సంఘం విధించిన టార్గెట్ సాధించని నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. స్వంత ఆదాయం యాభై శాతం కంటే దిగువన కలిగి, మిగిలిన యాభై శాతం కేంద్ర గ్రాంటులు, పన్నుల వాటాల మీద ఆధారపడే పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. స్వంత ఆదాయంలో సబ్సిడీల మీద 30శాతం ఖర్చు పెడుతూ ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండవ స్థానంలో ఉంది. మొత్తం ఖర్చులో రెవెన్యూ ఖర్చు ఎనభై శాతానికి పైగా ఉన్న పది రాష్ట్రాల్లో ఆంధ్రా ఒకటి. అంటే క్యాపిటల్ ఖర్చు చాలా తక్కువ, (ఆగస్టు దాకా కేవలం రూ.5856 కోట్లు – బడ్జెట్ అంచనాలో 19 శాతం మాత్రమే) రెవెన్యూ ఖర్చు సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టినా, ఆ ప్రభావం ఆ సంవత్సరం మేరకు మాత్రమే అని ఆర్బీఐ వివరించింది. క్యాపిటల్ పనుల మీద ఖర్చుతో రెండు మూడేళ్ళలో ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి చెందడం ప్రారంభిస్తుంది అని ఆర్బీఐ పత్రం వివరించింది. ఇవన్నీ ఆర్థిక ఆరోగ్యాన్ని సూచించేందుకు ఆర్బీఐ పెట్టుకొన్న సూచికలు. మరి ఏ విధంగా, ఏ ప్రాతిపదికన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉంది, వెలిగిపోతోంది, వృద్ధిలో దూసుకుపోతోంది అని ఇటీవల శాసనసభలో ఎలా చెప్పారో తెలీదు. రాష్ట్ర ప్రజలు తమకు తెలియకుండా, పైకి లేవలేనంత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు అన్నది మాత్రమే వాస్తవం. ఈ 'అప్పులతో అభివృద్ధి' అనే విచిత్ర భావన మీద, కేంద్రం సరైన నిర్ణయం తీసుకొంటుందని ఆశిద్దాం.

# అందరిదీ అనిపించే అభివృద్ధి ఏదీ?



గతపదేళ్లలో తెలంగాణా రాష్ట్ర జనాభా పొందికలో విపరీతమైన మార్పులు వచ్చాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో మూడు కోట్ల 50లక్షల జనాభా ఉంటే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన 2020 స్టాటిస్టికల్ రిపోర్టు అంచనా ప్రకారం రాష్ట్ర జనాభా ఇప్పుడు మూడు కోట్ల 77 లక్షలకు పెరిగింది. వీరిలో 0 నుంచి 4 సంవత్సరాల వయసు శిశువులు 31 లక్షల మందికి పైగా ఉన్నారు. వీరి అవసరాలు ప్రధానంగా ఐసిడిఎస్ పథకాల ద్వారా, అంగన్ వాడీ సెంటర్ల ద్వారా తీరాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటి వరకూ ఈ వయసు పిల్లల కోసం రూపొందించిన పథకాలు చాలా తక్కువ. ఈ వయసు పిల్లలలో మెదడు ఎదుగుదల వేగంగా ఉంటుంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఈ వయసు పిల్లలలో కూడా రక్తహీనత, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎమ్ఐ) సరిగా లేకపోవడం లాంటి లక్షణాలు ఉన్నట్లు సమగ్ర కుటుంబ ఆరోగ్య సర్వే 5వ రౌండ్‌లో బయటపడింది. సరైన పరిసరాలు, పోషకాహారం, అవసరమైన వైద్యం అందుబాటులో ఉంటే ఈ పిల్లలందరూ ఆరోగ్యంగా ఎదుగుతారు. ఐదేళ్ళ నుంచి 19 ఏళ్ల వయస్సు వరకూ రాష్ట్రంలో 86 లక్షల మంది ఉన్నారు. ఈ వయసు పిల్లలు బాల కార్మికులుగా మారకుండా, అందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించడం విద్యా హక్కు చట్టం ప్రకారమూ, రాజ్యాంగ ఆదేశిక సూత్రాల ప్రకారమూ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కాబట్టి ప్రభుత్వ రంగంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఉన్న స్కూళ్ళను మూసేయడం కాకుండా, పిల్లలలో డ్రాపౌట్స్ లేకుండా ప్రతి ఆవాస ప్రాంతంలోనూ ప్రభుత్వ స్కూలు ఉండేలా చూసే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అమ్మాయిల చదువులు ఆగిపోకుండా ఉండటానికి ఇది తక్షణ అవసరం. ఇప్పటికయితే స్కూళ్లలో విద్యా సామర్థ్యాలు బాగా లేవని నివేదికలు వస్తున్నాయి. మారుతున్న తెలంగాణా సామాజిక, ఆర్థిక పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా సిలబస్, విద్యా బోధనా పద్ధతులను అభివృద్ధి చేస్తూ, పిల్లలలో విద్యా సామర్థ్యాలను పెంచడం కీలకం. ఈ స్కూళ్లలోని పిల్లలకు మధ్యాహ్న భోజన పథకానికి ఇప్పటి వరకూ కేటాయిస్తున్న నిధులు అతితక్కువ. నాణ్యత లేని నాసి రకం ఆహారంతో జబ్బుపడుతున్న హాస్టల్ పిల్లల వార్తలు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్నాయి. ఇప్పుడు ఇస్తున్న నిధులతో కనీసం మామూలు భోజనం కూడా అందదు. ఈ వయసు పిల్లలకు సురక్షితమైన, పౌష్టికాహారం అందించడానికి, ప్రభుత్వం బడ్జెట్లో నిధులను పెంచాలి. సన్న వరిబియ్యం ఆధారిత ఆహారం మాత్రమే పౌషకాహారం కాదు. పోర్టిఫైడ్ ఫుడ్ పేరుతో కంపెనీలు ఉత్పత్తి చేసే పదార్థాల వైపు మొజు పెంచుకోకుండా, స్థానికంగా దొరికే చిరుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, మాంసం ఆధారిత ఆహారాన్ని ఈ పిల్లలకు అందించాలి. ఎక్కడికక్కడ రైతులు విష రసాయనాలు వాడకుండా వీటిని పండించి, స్థానిక స్కూళ్లకు, అంగన్ వాడీ సెంటర్లకు సరఫరా చేసేలా రైతు సహకార, ఉత్పత్తిదారుల సంఘాలతోనూ, ఈ ఆహార ఉత్పత్తుల ముడి సరుకులతో బిస్కట్లూ, లడ్లు వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులను స్కూళ్లకు సరఫరా చేసేలా స్థానిక మహిళా సంఘాల సభ్యులతోనూ విద్యా శాఖ ఒప్పందాలు కుదుర్చుకోగలిగితే ఇటు పిల్లలకు బలవర్ధక ఆహారం, అటు మహిళలకు జీవనోపాధి ఏక కాలంలో అందుతాయి. రాష్ట్రంలో 20 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసులో శారీరక శ్రమ చేయగలిగిన వాళ్ళు 2 కోట్ల 25 లక్షల మంది ఉన్నారు. వీరిలో 68 లక్షల మంది ఉన్నత విద్య పొందడానికి అనువైన వయసులో ఉన్నారు. రాష్ట్ర యువతీ యువకులు తప్పకుండా, తమ ఆసక్తులకు అనుగుణంగా ఉన్నత విద్యను పొందడానికి అవసరమైనన్ని విద్యా సంస్థలను రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నెలకొల్పి ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది. ఎవరైనా కొందరు విద్యార్థులు బయట ప్రాంతాలకు, బయట దేశాలకు విద్యాభ్యాసం కోసం వెళ్లాలని అనుకుంటే అటువంటి వారికి ఉచిత విద్య అందించడానికి లేదా బ్యాంకుల నుంచి విద్యా ఋణం ఇప్పించడానికి పూనుకోవాలి. ప్రస్తుతం బ్యాంకులు విద్యార్థులకు ఇస్తున్న విద్యా ఋణాలపై గ్యారంటీ అడుగుతున్నాయి. గ్యారంటీ చూపించలేని సందర్భాలలో పేద కుటుంబాల పిల్లలు చదువును ఆపేస్తున్నారు. వీరికి ప్రభుత్వమే బ్యాంకులకు కౌంటర్ గ్యారంటీ ఇవ్వడానికి సిద్ధం కావాలి. వివిధ కారణాల వల్ల చదువులను మధ్యలోనే ఆపేసిన, లేదా చదువు పట్ల ఆసక్తిలేని యువతీ యువకులకు జీవనోపాధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు ఉండటం లేదు. ఇంగ్లీష్ భాషపై పట్టు ఉండటం లేదు. వీరికి స్థానికంగా ఎక్కడికక్కడ ఉపాధి అవకాశాలు దొరకాలంటే ఆదివాసీ గూడేలు, గ్రామాలు, నగరాల్లోని బస్తీ స్థాయిలో అవసరమైన శిక్షణలను ఏర్పాటు చేయాలి. ఇప్పటి వరకూ అమలవుతున్న "స్కిల్ బిల్డింగ్" శిక్షణలు యువత ఉపాధి పొందడానికి పెద్దగా ఉపయోగపడడం లేదు. పైగా తాము నేర్చుకున్న అంశాలతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన పెట్టుబడులు, మౌలిక వసతులు వారికి ఉండడం లేదు. అందుకే వడ్డీ రాయితీతో కూడిన పెట్టుబడి కూడా వారికి అందించాలి. గ్రామీణ ప్రాంతంలో భూమి లాంటి స్వంత వనరులు లేని అనిపుణ, నిరాక్షరాస్య శ్రమజీవులకు జీవనోపాధులు పొందడానికి అవసరమైన నైపుణ్యాలను అందించి, శ్రమను సులువు చేసే పనిముట్లు, యంత్రాలను వారికి సమకూర్చాలి. గ్రామీణ స్థాయిలో చిన్న పెద్ద యంత్రాలతో కూడిన కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి, కేరళ తరహాలో వ్యవసాయ కూలీలను, సన్న చిన్నకారు రైతులను గ్రీన్ ఆర్మీగా నిర్మించాలి. వారికి ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్లను నిర్వహించే బాధ్యతను అప్పగిస్తే గ్రామీణ నిరుద్యోగం తగ్గుతుంది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం తక్షణం తీసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర స్థానిక యువతీ యువకులకు ఇక్కడే ఉపాధి అవకాశాలు దొరికేందుకు, ఇక్కడి నుండి వలసలు ఆగేందుకు అన్ని వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలలో స్థానికులకు 80శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఆయా సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలి. ఆ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేయాలి.ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చే కార్మికులు తక్కువ వేతనానికి, కట్టు బానిసల్లా పని చేస్తారు అనే ధోరణితో ఎక్కువ సంస్థలు ఇతర రాష్ట్రాల వారిని ఉద్యోగులుగా, కార్మికులుగా నియమించుకుంటున్నాయి. ఈ ధోరణిని నిరుత్సాహపరిచేలా రాష్ట్రంలో కనీస వేతనాలను ఎప్పటికప్పుడు సవరించాలి. ఇప్పటివరకూ వీటిని పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ పూర్తిగా బలహీనంగా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనుగుణంగా కార్మిక శాఖను బలహీన పరిచారు. కార్మిక శాఖకు కార్మిక చట్టాలను అమలు చేసే విస్తృత అధికారాలను ఇవ్వాలి. లేనట్లయితే రాష్ట్ర శ్రమజీవులు ఆధునిక కట్టు బానిసలుగా మిగిలిపోతారు. రాష్ట్రంలో 60 నుంచి 85 సంవత్సరాల మధ్య వయస్కులు 40 లక్షల మంది ఉన్నారు. జీవితాంతం కష్టపడి పనిచేసి, అలసిపోయిన వృద్ధులు వీళ్ళు. వీరి కోసం ఇప్పటికీ ప్రభుత్వానికి ఒక నిర్దిష్ట విధానమే లేదు. నెలకు రెండువేలు వృద్ధాప్య పింఛను ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నది. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు వృద్ధులున్నా, కేవలం ఒక్కరికి మాత్రమే వృద్ధాప్య పింఛను ఇస్తూ అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్నది. పేద, మధ్యతరగతి కుటుంబాలలో వృద్ధులకు సరైన నివాస వసతి, ఆహారం, ఆదరణ దొరకని సందర్భాల్లో వారిని అక్కున చేర్చుకోవడానికి వీలైన వసతిగృహాలు ప్రభుత్వ రంగంలో అతి తక్కువగా ఉన్నాయి. ఆరోగ్య సమస్యలు ఉన్న వృద్ధులను చేర్చుకోవడానికి వైద్య సదుపాయాలు ఉన్న వసతి గృహాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో, నగరాల్లోని పేదల బస్తీలలో తక్కువగా ఉన్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నవి కూడా వనరుల కొరతను ఎదుర్కుంటున్నాయి. రాష్ట్ర అనిపుణ కార్మికుల కనీస వేతనంలో కనీసం సగం మొత్తాన్ని పింఛనుగా నిర్ణయిస్తూ, కుటుంబంలో ఉన్న అందరు వృద్ధులనూ పింఛనుకు అర్హులుగా గుర్తించేలా నిబంధనలు మార్చాలి. సమాజంలో అందరి అవసరాలూ ఒకటి కావు. కాబట్టి పరిష్కారాలు కూడా విభిన్నంగా ఉండాలి. సహజ వనరులకు, రాష్ట్ర బడ్జెట్టులో ఆర్థిక వనరులకు ఉండే పరిమితులను దృష్టిలో ఉంచుకుని, లబ్ధిదారుల ఎంపిక సవ్యంగా జరగాలి. మాకు ఇష్టం వచ్చిన వారికి పథకాలు ఇచ్చుకుంటాం అని మంత్రులే బాహాటంగా ప్రకటించడాన్ని చూస్తున్నాం. ఈ ధోరణి విడనాడి పాలకులు అభివృద్ధి నమూనాకు సాధారణ ప్రజలను కేంద్రంగా ఉంచుకోవాలి.

# రాష్ట్రం పరిధిలోనే 'పోడు' సమస్యకు పరిష్కారం

పోడు భూమి సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు నేల విడచి సాము చేస్తున్నట్లు ఉన్నాయి. అటవీ హక్కుల గుర్తింపులో చారిత్రకంగా అన్యాయానికి గురైన ఆదివాసీలూ, ఇతర అటవీ ఆధారిత సంప్రదాయక నివాసితులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం–2006'ను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. అయితే అన్యాయాన్ని సరిదిద్దడంలో ప్రభుత్వం ఇంకా విఫలమవుతూనే ఉన్నది. చట్టం పరిధిలోనే పరిష్కరించగలిగే పోడు భూమి సమస్యలు కొన్ని, ప్రస్తుత చట్టం చట్రం వెలుపల ఉన్న ఆదివాసీల అటవీ భూ హక్కుల సమస్యలు మరికొన్ని ఉన్నాయి. అయితే ఈ రెండు వేర్వేరు సమస్యల పరిష్కారానికి ఒకే సమాధానం కోసం వెతకటం వల్లనే సమస్య మరింత జటిలమవుతున్నది. 2006లో అమల్లోకి వచ్చిన 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం' 13 డిసెంబర్ 2005 (నిర్దేశిత తేదీ)కి పూర్వం అనుభవంలో ఉన్న అటవీ భూమి హక్కులు గుర్తింపునకు ఉద్దేశించినది. ఆ నిర్దేశిత తేదీ తర్వాత అనుభవంలో గల అటవీ భూమి హక్కుల గుర్తింపు వీలు పడదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. సమస్య పరిష్కారం కావాలంటే కేంద్ర ప్రభుత్వ చట్ట సవరణ చేయటం ఒక్కటే మార్గమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు ముఖ్య మంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసారు. ఈ లేఖకు మార్చి 2022 లో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా స్పందించారు. చట్టం నిర్దేశించిన తేదీని పొడిగించటం వల్ల గిరిజన హక్కులకు భంగం కల్గుతుందని ఆయన అన్నారు. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజన భూములు గిరిజనేతరులకు వెళ్లకుండా చూడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కానీ 75 ఏళ్ళ పాటు అటవీ భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనేతరులకు మాత్రమే అటవీ హక్కుల గుర్తింపునకు చట్టం వీలు కల్పించింది. దానికి భిన్నంగా ఇటీవలి కాలంలో అటవీ భూమి సాగు చేస్తున్న గిరిజనేతరుల హక్కులు గుర్తింపు కోసం చట్ట సవరణ చేస్తే గిరిజనులకు నష్టం వాటిల్లుతుందని అర్జున్ ముండా తెలంగాణ ముఖ్యమంత్రికి తన సమాధానంలో పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటివరకు తెలంగాణలో జూలై 2022 నాటికి 3.10 లక్షల ఎకరాల అటవీ భూమిపై 97,434 మంది గిరిజనులకు హక్కుల పట్టాలను మంజూరు చేశారు. ఇంకా రెండు లక్షలకు పైగా గిరిజన దరఖాస్తులు అటవీ భూమి పట్టాలు కోరుతూ గ్రామసభల ముందున్నాయి. అయితే నిర్దేశిత తేదీ తర్వాత సాగులో ఉన్న అటవీ హక్కుల విషయంలో హక్కులు గుర్తింపు ప్రస్తుత చట్టం రీత్యా సాధ్యం కాదు. వాటి విషయంలో గిరిజనులు అటవీ భూ హక్కుల పట్టాలను పొందలేరు. ఈ నేపథ్యంలో తెలంగాణ మాతా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చట్టం పేర్కొన్న నిర్దేశిత తేదీని సడలించి అటవీ హక్కుల చట్టాన్ని సవరించమని కోరుతూ జూలై 2022లో మరోసారి కేంద్రాన్ని అర్థించారు.వాస్తవానికి ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర శాసనాలను గిరిజన హక్కుల రక్షణ కోసం సవరించి అమలు చేసే అధికారం రాష్ట్ర గవర్నరుకు ఉంటుంది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆ మేరకు ఒక ప్రతిపాదనను రూపొందించి, గిరిజన సలహా మండలిలో చర్చించి రాష్ట్ర గవర్నరు ప్రకటన కోసం పంపాలి. గిరిజన అటవీ హక్కుల గుర్తింపునకు అవకాశం ఇచ్చేలా నిర్దేశిత తేదీని పొడిగిస్తూ రాజ్యాంగం 244 అధికరణ పేరా 5(1) కింద గవర్నరు ఒక నోటిఫికేషన్‌ను ఇవ్వవచ్చు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అర్థించాల్సిన అవసరం లేదు. ఆదివాసీ అటవీ హక్కులు సమస్యకు తెలంగాణ రాష్ట్రంలోనే పరిష్కారం ఉంది. కానీ ఈ దిశగా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయలేదు. అనుభవంలో ఉన్న అటవీ భూముల నుంచి బలవంతంగా ఆదివాసీలను బయటకు నెట్టే అటవీ శాఖ దుశ్చర్యలు గిరిజన ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. హక్కు కోరుతూ దరఖాస్తుచేసుకున్న అటవీ భూమి విషయంలో జిల్లా స్థాయిలో నిర్ధారణ జరిగేంతవరకూ ఆదివాసులను ఆ భూముల నుంచి తొలగించరాదని చట్టం స్పష్టంగా పేర్కొంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా అటవీ శాఖ సిబ్బంది ఆదివాసీలపై భౌతిక దాడులకు పాల్పడతున్నది. ఇదిలా ఉండగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద శాసనపరంగా ఏర్పరచిన కమిటీలను నిర్వీర్యం చేసే విధంగా పోడు భూమి సమస్య పరిష్కారానికి వివిధ శాఖాధికారులతో ఒక కమిటీ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులను జారీ చేసింది. సెప్టెంబర్ 11, 2022న జారీ చేసిన ఈ ఉత్తర్వులూ ప్రశ్నార్థకంగా మారాయి. గ్రామసభ, సబ్ కలెక్టర్ అధ్యక్షతన సబ్ డివిజన్ స్థాయి కమిటీ, జిల్లా కలెక్టరు అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలకు మాత్రమే పోడు భూమి హక్కులను నిర్ధారించే, అర్హులకు పట్టాలు మంజూరు చేసే శాసనాధికారం ఉంది. ఆ కమిటీలలో మండల, జిల్లా పంచాయితీ రాజ్ సంస్థ ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారు. ఆ కమిటీలు సక్రమంగా పనిచేస్తే పోడు భూ హక్కుల నిర్ధారణ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అయితే పోలీసు, రెవెన్యూ, అటవీ, ఇతర శాఖ అధికారులతో జిల్లా స్థాయిలో మరొక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## సీపీఐ, కాంగ్రెస్ కంచుకోట

నల్గొండ, అక్టోబరు 4, :తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న మునుగోడుకి ఎంతో చరిత్ర వుంది. 1967 వరకు చిన్న కొండూరు నియోజకవర్గంగా ఉన్న నియోజకవర్గం? 1967 తర్వాత నుండి మునుగోడు నియోజకవర్గంగా మారింది. గతంలో మునుగోడు నియోజకవర్గం 1967 వరకు చినకొండూరు నియోజకవర్గంగా ఉండేది.

1952 మొదటి సాధారణ ఎన్నికల్లో పీడీఎఫ్ నుండి బివిఎన్ రావుపై కె.వెంకట్రామారావు గెలిచారు. 1957 లో (కె.వెంకట్రామారావు పిడిఎఫ్ పై కాంగ్రెస్ నుండి కొండా లక్ష్మణ్ బాపూజీ గెలిచారు)

1962 లో కొండాలక్ష్మణ్ బాపూజీ కాంగ్రెస్ పై సిపిఐ నుండి కె.గురునాథరెడ్డి గెలిచారు. 1965 లో ఉపఎన్నిక రాగా జె.ఎం.రెడ్డి సిపిఐపై కాంగ్రెస్ నుండి కొండాలక్ష్మణ్ బాపూజీ గెలిచారు

1967లో మునుగొడు నియోజకవర్గం ఏర్పడింది?

1967 లో కాంగ్రెస్ నుండి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గెలుపు(ఉజ్జిని నారాయణరావు సీపీఐ పై)

1972 లో కాంగ్రెస్ నుండి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గెలుపు(ఉజ్జిని నారాయణరావు సీపీఐ పై)

1978 లో కాంగ్రెస్ నుండి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గెలుపు(కె.రామక్రుష్ణారెడ్డి జనతా పార్టీపై)

1983 లో లో కాంగ్రెస్.ఐ నుండి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గెలుపు(ధర్మబిక్షం సీపిఐపై)

1985 లో సిపిఐ నుండి ఉజ్జిని నారాయణరావు గెలుప )(ఎం.నారాయణరావు కాంగ్రెస్ పై)

1989 లో సిపిఐ నుండి ఉజ్జిని నారాయణరావు గెలుపు(పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పై)

1994 లో సిపిఐ నుండి ఉజ్జిని నారాయణరావు గెలుపు(పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఇండిపెండెంట్ పై)

1999 లో పాల్వాయి గొవర్దన్ రెడ్డి గెలుపు (టీడీపీ జల్లా మార్కండేయపై)

2004 లో సిపిఐ నుండి పల్లా వెంకట్ రెడ్డి గెలుపు(చిలువేరు కాశీనాథ్ టీడీపీ పై)

2009 లో సిపిఐ నుండి ఉజ్జిని యాదగిరి రావు గెలుపు(పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పై). 2014 లో టీఆర్ఎస్ నుండి కూసుకుంట్ల ప్రబాకర్ రెడ్డి గెలుపు(పాల్వాయి స్రవంతి ఇండిపెండెంట్ పై)

2018 లో కాంగ్రెస్ నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గెలుపు(కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి టీఆర్ఎస్ పై)

# టెలికాం విప్లవం... 1980 నుంచి 2022 వరకు..

అక్టోబర్ 1 నుండి 5జీ టెక్నాలజీ వాణిజ్య సేవలను భారత్‌లో అధికారికంగా ప్రధానమంత్రి ప్రారంభించారు. నిజానికి టెలికాం రంగంలో ఇంత త్వరితగతిన వచ్చినన్ని సాంకేతిక మార్పులు మరే ఇతర రంగంలో రాలేదు. 1980లలో 1జీ టెక్నాలజీ ద్వారా అనలాగ్ వాయిస్ కాల్స్ మాట్లాడుకునే సౌకర్యం వస్తే, 1990 నాటికి 2జీ టెక్నాలజీ ద్వారా డిజిటల్ వాయిస్, ఎస్ఎంఎస్ ఇచ్చుకునే సదుపాయం వచ్చింది. 2000 నాటికి 3జీ సాంకేతి కత ద్వారా మొబైల్‌లో డేటా వాడు కునే సౌకర్యం కల్పించారు. 2010 నాటికి 4జీ ద్వారా మొబైల్ బ్రాడ్ బ్యాండ్ వెసులుబాటు వచ్చింది. ఇప్పుడు 5జీ ద్వారా మొబైల్‌లోనే హై స్పీడ్ నెట్‌వర్క్ కల్పిస్తున్నారు. ఎక్కువ స్పీడ్ కలిగిన నెట్‌వర్క్ కావాలంటే భూగర్భ కేబుల్ ద్వారా వేసిన బ్రాడ్ బ్యాండ్, లేక ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్ తీసుకోవాలని అనుకునే దశ నుండి, మొబైల్‌లోనే రియల్ టైమ్ వేగంతో బ్రాడ్ బ్యాండ్ వాడుకునే వెసులుబాటు 5జీ ద్వారా కలుగు తుంది. 5జీ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే విద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్, ఐటీ, వాతావరణ, అంతరిక్ష రంగా లలో పెను మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థల్లో 5జీ



అమలు ద్వారా లోడ్ నియంత్రణ నెట్‌వర్క్ గణనీయంగా మెరుగవుతుంది. వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ సౌకర్యం వల్ల... విద్యారంగం, వైద్య సేవలు ప్రపంచ స్థాయికి చేరు తాయని భావిస్తున్నారు. మిషన్ లెర్నింగ్ టెక్నాలజీ ద్వారా యంత్ర పరికరాల రిపేరు, యంత్రాలను నడపటం మొబైల్ ద్వారానే చేయగలం. మరింత అధునాతన వీడియో కాన్ఫ రెన్స్ సౌకర్యం ఏర్పడుతుంది. ఐటీ లేదా పెద్దపెద్ద కంపె నీలలో హై స్పీడ్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా పెను మార్పులు వస్తాయి. 5జీ టెక్నాలజీ నిరంతరం రావడానికి ఎక్కువ టవర్లు అవసరం వీటికి అయ్యే ఖర్చు ఎక్కువ. 4జీతో పోలిస్తే ఎక్కువ దూరం ప్రయాణించదు. అందుకే ఎక్కువ టవర్లు, డబ్బు అవసరం. ఇప్పుడు వాడు తున్న మొబైల్స్ బదులుగా 5జీ టెక్నాలజీ మొబైల్స్ వాడాల్సి ఉంటుంది. హాకర్లు సైబర్ నేరాలకు మరింత ఎక్కువగా పాల్పడే అవ కాశం ఎక్కువ. వర్షం వచ్చినా 5జీ నెట్‌వర్క్ సరిగా పనిచేయదు. రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ ఈనెలాఖరులోగా 5జీ నెట్‌వర్క్‌ను కమర్షియల్‌గా లాంచ్ చేస్తాయి. ముందుగా కొన్ని ప్రధాన మెట్రో నగరాల్లో 5జీ సేవలు మొదలవుతాయి. ఆ తర్వాత క్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. 4జీతో పోలిస్తే 5జీ నెట్‌వర్క్‌లో ఇంటర్నెట్ 10రెట్లు వేగంగా వస్తుందని అంచనాలు ఉన్నాయి. కాగా, రెండు సంవత్సరాల్లోగా దేశమంతా 5జీ నెట్‌వర్క్‌ను అందించాలని టెలికం సంస్థలు టార్గెట్‌గా పెట్టుకున్నాయి. మరోవైపు వొడాఫోన్ ఐడియా మాత్రం సందిగ్ధంలో ఉంది. ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన ఆ సంస్థ.. 5జీ రోల్ అవుట్ గురించి స్పష్టంగా సంకేతాలు ఇవ్వడం లేదు. 5జీ వార్‌లో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ తీవ్రంగా పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు కంపెనీలు టారిఫ్స్ దగ్గరి నుంచి 5జీని విస్తరించే వరకు పోటాపోటీగా ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నాయి. 5జీ యూజర్ల బేస్‌ను పెంచుకునేందుకు వ్యూహాత్మకంగా దూసుకెళ్లను న్నాయి. ఇప్పటికే ఈనెలలోనే 5జీని తీసుకొస్తామని రెండు సంస్థలు ప్రకటించాయి. దీంతో ఈ నెలాఖరులోగా దేశంలో 5జీ కమర్షియల్ లాంచ్ కూడా ఉండే అవకాశాలు బలంగా ఉన్నాయి. కేవలం వినోదం, గేమింగ్, డేటా వినియోగం పెంచుకోవడంపై ప్రయివేట్ టెలికాం కంపె నీలు దృష్టి పెడతాయి కనుక యువత చెడిపోయే ప్రమాదం ఎక్కువ. ప్రయివేట్ టెలికాం కంపెనీలతో పాటు 5జీ టెక్నా లజీని ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌కు కూడా ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో 5జీ సేవల అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో వైపు కేంద్ర టెలికం మంత్రి అశ్వినీ వైష్ణవ్ 6జీ సేవలపై కీలక ప్రకటన చేశారు. 6జీ సేవల్లోనూ ఇండియా ముందుంటుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్స్ యూనియన్ ఆధ్వర్యంలో 6జీ, 5జీ మొబైల్ సిస్టమ్ అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన అధ్యయన బృందాలకు ఇప్పుడు భారత ప్రతినిధుల అధ్యక్షత వహిస్తున్నట్టు చెప్పారు. 3జీ నుంచి 4జీకి, 4జీ నుంచి 5జీకి మారినట్టు టెలికం టెక్నాలజీ ఇకపై 5జీ నుంచి 6జీకి మారుతుంది. నిజానికి 4జీ నుంచి 5జీకి మారడాన్ని టెక్నలజీలో అతిపెద్దగా మార్పుగా చెప్పుకోవచ్చు. దీనిని అప్‌గ్రేడ్‌గా చెప్పడం తప్పే అవుతుంది.

6జీ ప్రమాణం అభివృద్ధి, దాని చుట్టూ ముందుగానే అధ్యయనాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఆ పని భారతదేశంలోనే ముందుగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని టెలికం మంత్రి వైష్ణవ్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే నిజానికి 5జీ (5ఉ) విషయంలో భారత్ వెనకబడినప్పటికీ, అత్యంత వేగవంతమైన 5జీ నెట్‌వర్క్‌గా మాత్రం అవతరించే అవకాశం ఉంది. 5జీతో పోలిస్తే 6జీ అనేక రెట్లు వేగవంతమైనదిగా ఉంటుందని చెబుతున్నారు.

# సీనియర్లు సహాయ నిరాకరణ...

హైదరాబాద్, అక్టోబరు 4, :తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని సమస్యలు చుట్టుముడుతున్నాయా?, ఇటు మునుగోడు ఉప ఎన్నిక ప్రచార బాధ్యతలు, అటు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సన్నాహాల మధ్య ఆయన నలిగి పోతున్నారా? ఇదే అదనుగా సీనియర్లు తమ వంతు సమస్యలు సృష్టిస్తున్నారా? అంటే, గాంధీ భవన్ వర్గాలు అవునననే అంటున్నాయి. నిజానికి, రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి నప్పటి నుంచి పార్టీ సీనియర్లు ఆయన పట్ల కొంత గుర్రుగానే ఉన్నారు. అదేమీ, రహస్యం కాదు. అయినా, ముందు కొంత కాలం, రేవంత్ రెడ్డి, సర్దుకు పోయే ధోరణి అవలంబించారు. అందరినీ కలుపుకు పోయే ప్రయత్నం చేశారు. పార్టీ సీనియర్లలోనూ ఒకరిద్దరు మినహా మిగిలి నేతలందరూ రేవంత్ రెడ్డికి పార్టీ అధిష్టానం అండదండలు పుష్కలంగా ఉండడం వల్లనో ఏమో కానీ అలివి కాని చోట అధికుల మనరాదు అన్నట్లు మౌనంగా ఉండిపోయారు. కానీ, ఎప్పుడైతే రేవంత్ రెడ్డి సీనియర్లను హోం గార్డ్స్ తో పోలుస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారో, ఇక అక్కడి నుంచి, సీన్ మారిపోయింది. నిజానికి,అప్పటికే రెంత్ రెడ్డి ఒకటికి రెండు సార్లు గీత దాటి, సీనియర్ నాయకులను హర్ట్ చేసే వ్యాఖ్యలు చేశారు. అలాగే, రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి,




అద్దంకి దయాకర్ మునుగోడు సభలో పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ కోమటి రెడ్డి వెంకట రెడ్డిని ఉద్దేశించి పార్టీలో ఉంటే ఉండు, పోతే ..' అంటూ చేసిన వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి, సేనియర్ల మధ్య దూరాన్ని మరింత పెంచింది. దయాకర్ తో పాటుగా, రేవంత్ రెడ్డి కూడా కోమటి రెడ్డికి క్షమాపణలు చెప్పినా, అటు రేవంత్, ఇటు దయాకర్ చేసిన వ్యాఖ్యలు సీనియర్లను వెంటాడుతూనే ఉన్నాయి. పైకి అంతా సర్దుకున్నట్లు కనిపించినా లోలోపల అగ్గి రగులుతూనే వుందని తాజా పరిణామాలు సూచిస్తున్నాయని న్నాయని పరిశీలకులు అంటున్నారు. ఇంతకాలం ఒక విధంగా సరైన సమయం కోసం ఎదురు చూస్తున్న సీనియర్ నాయకులు, ఇటు నుంచి మునుగోడు అటు నుంచి రాహుల్ భారత్ జోడో యాత్ర రేవంత్ రెడ్డిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న సమయంలో బాధ్యత మొత్తాన్ని, రేవంత్ రెడ్డిపై వదిలేసి, తమాషా చూస్తున్నారని, అందుకే రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అంటున్నారు. ఓ వంక మునుగోడు ఉప ఎన్నిక షెడ్యూలు వచ్చేసింది. ఈ రోజుకు ఖచ్చితంగా నెల రోజుల తర్వాత, నవంబర్ 3 న పోలింగ్ జరుగుతుంది. మరో వంక కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కన్యా కుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిస్తున్న భారత్ జోడో పాదయాత్ర ఈ నెల 24 న రాష్ట్రంలో ప్రవేశిస్తోంది. ఇదే అదనుగా సీనియర్ నాయకులు రేవంత్ రెడ్డిని ఉక్కిరి బిక్కిరి చేసే వ్యూహాలతో పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా, మునుగోడు ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి స్రవంతి నెగ్గితే రేవంత్ రెడ్డి మరింతగా రెచ్చి పోతారని, దానికి తోడు రాహుల్ యాత్ర రాష్ట్రంలో సక్సెస్ అయితే ఇక తమకు కాంగ్రెస్ పార్టీలో నూకలు చెల్లినట్లే భావిస్తున్న సీనియర్లు ముందు జాగ్రత్తగా ఒక విధంగా సహాయ నిరాకరణ సూత్రాన్ని పాటిస్తున్నారని అంటున్నారు. రేవంత్ రెడ్డి, కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలతోనే కాకుండా, ఇటు సొంత పార్టీలోని అంతర్గత శత్రువులతోనూ ఏకకాలంలలో పోరాడా వలసి వస్తోందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. అదలా ఉంటే, మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు, రేవంత్ రెడ్డితో కొంత సఖ్యతగా ఉంటున్న మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు గీతా రెడ్డి, షబ్బీర్ ఆలీ సహా మరి కొందరికి నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. విచారణకు ఢిల్లీ పిలిపించింది. రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకు పడుతున్నారు. ఈడీ నోటీసుల పేరుతో కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలిపించడం.. వారిని భయభ్రాంతులకు గురిచేసి బీజేపీలో చేర్చుకునేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీజేపీ ఈడీని ఎలక్షన్ డిపార్ట్‌మెంట్‌గా మార్చిందని పేర్కొన్నారు. అయితే, రేవంత్ రెడ్డి ఫ్రస్ట్రేషన్ కు అసలు కారణం సీనియర్లు సహకరించక పోవడమే అంటున్నాయి పార్టీ వర్గాలు. కారాణాలు ఏవైనా రేవంత్ రెడ్డి బయటి నుంచే కాకుండా లోపలి నుంచి కూడా సమస్యలు ఎదుర్కొంటున్నది మాత్రం నిజమని పరిశీలకులు అంటున్నారు.

## కేసీఆర్ కు ఎన్ ఆర్ ఐల నుంచి మద్దతు

హైదరాబాద్, అక్టోబరు 4, :జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు సిద్ధమవుతోన్న గులాబీ అధినేత కేసీఆర్. తన జాతీయ పార్టీ ఏర్పాటు కోసం చేస్తున్న సుదీర్ఘ కసరత్తు కొలిక్కి వచ్చింది. దసరా రోజే జాతీయ రాజకీయ పార్టీని ప్రకటించేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. అక్టోబరు 5న 11 గంటలకు టీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులంతా కలిసి.. జాతీయ పార్టీ ఏర్పాటుపై ఏకగ్రీవ తీర్మానం చేస్తారు. అనంతరం 12 గంటలకు టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో కూడా జాతీయ పార్టీ ఏర్పాటుపై ఏకగ్రీవ తీర్మానం చేస్తారు. ఈ రెండు సమావేశాల అనంతరం.. గులాబీ దళపతి కేసీఆర్ జాతీయ పార్టీ ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రకటన చేస్తారు. పార్టీ ఎలా ఉండబోతోంది.. జెండా, అజెండా, కార్యచరణ లాంటి అంశాలపై క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. ఇదే సమావేశంలో జాతీయ పార్టీకి సంబంధించిన కోఆర్డినేటర్లను కూడా ప్రకటించనున్నట్టు సమాచారం. ఈ సమావేశానికి కేసీఆర్‌తో కలిసి నడిచే జాతీయ నాయకులను సైతం ఆహ్వానించినట్టు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో తన మార్కు చూపించేందుకు సిద్ధమైన కేసీఆర్.. దేశ ప్రజల్లోకి జాతీయ పార్టీని తీసుకెళ్లేందుకు పక్కా ప్రణాళికలు వేసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే.. దేశంలోని పలు ప్రాంతీయ పార్టీల పెద్దలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, రాజకీయ నిపుణులతో సమాలోచనలు జరిపిన గులాబీ బాస్.. చాలా క్లారిటీగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. కేసీఆర్ జాతీయ పార్టీ ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా.. మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. పాలనలో ఫెయిల్ అయిన కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజల దృష్టి మరల్చేందుకే జాతీయ పార్టీ నాటకం మె?దలు పెట్టారని ప్రతిపక్ష నేతలు విమర్శి?స్తున్నారు. లోక్‌సభలో ఆ పార్టీకి ఉన్న 8 మంది సభ్యులతో దేశ రాజకీయాల్లో ఎలా చక్రం తిప్పుతారని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలకు భయపడే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. దేశం సంగతి దేవుడెరుగు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో గట్టెక్కుతుందో లేదో చూసుకోవాలని హితవు పలుకుతున్నారు. కేసీఆర్ అభిమానులు, టీఆర్ఎస్ నేతలు మాత్రం జాతీయ పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు యూకే ఎన్నారైలు స్పష్టం చేశారు. ప్రఖ్యాత లండన్ టవర్ బ్రిడ్జ్ వద్ద సమావేశమైన ఎన్నారైలు దేశ్ కీ నేత కేసీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్ భారీ కటౌట్‌ను అక్కడ ఏర్పాటు చేశారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరం ఉందని.., కేసీఆర్ వల్లే అధి సాధ్యమవుతుందని వారు వెల్లడించారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వచ్చి దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

## మునుగోడు మీదుగా రాహుల్ యాత్ర..?



హైదరాబాద్, అక్టోబరు 4, : అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేస్తున్న బీజేపీ ఆ దిశగా పకడ్బందీ రీతిలో వ్యూహ రచనలు చేస్తున్నది. మునుగోడు ఉప ఎన్నిక ద్వారా తమ సత్తా ఏంటో నిరూపించేందుకు బీజేపీ సిద్ధం అవుతుంది. ఇప్పటి వరకు ఉత్తర తెలంగాణలో మాత్రమే బలం ఉందనే అపవాదు నుండి దక్షిణ తెలంగాణలోనూ తమకు పట్టు ఉందని నిరూపించడానికి ఈ మునుగోడు ఉప ఎన్నిక గెలవాలనే టార్గెట్‌తో బీజేపీ పావులు కదుపుతున్నది. మునుగోడులో పాగా వేయాలనే ఉద్దేశంతో కమలనాధుల పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. తాజాగా బై పోల్ నోటిఫికేషన్ షెడ్యూల్ ఖరారు వెనుక ఓ ఆసక్తికర చర్చ అందరిని ఆలోచింపచేస్తుంది. తాజాగా బీజేపీ తీసుకున్న నిర్ణయం వెనుక ఒక్క దెబ్బకు రెండు పిట్టలు వ్యూహం ఉందనే టాక్ వినిపిస్తోంది. జాతీయ రాజకీయాల ఎంట్రీపై ముఖ్యమంత్రి కేసీఆర్ సీరియస్ నిర్ణయాలు తీసుకుంటున్న సందర్భం ఒక వైపు.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణలోకి ప్రవేశించడం మరో వైపు ఉన్న సందర్భంలో మునుగోడు షెడ్యూల్ బీజేపీకి కలిసివచ్చేలా ఉందనే టాక్ వినిపిస్తోంది. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, తన పదవికి రాజీనామా వెనుక బీజేపీ తనకు అనుకూలమైన వాతావరణం సృష్టించుకునేందుకే అనేది రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట. రాజగోపాల్ రెడ్డి ఎపిసోడ్‌లో మొదటి నుంచి పార్టీకి మైలేజ్ ఇచ్చే అంశాలకే బీజేపీ ప్రాధాన్యత ఇస్తుంది. తాజాగా ఉప ఎన్నిక తేదీ విషయంలోనూ పార్టీకి కలిసి వచ్చేలా షెడ్యూల్ ఫ్రేమ్ చేయబడిందనే టాక్ వినిపిస్తుంది. జాతీయ రాజకీయాలపై కేసీఆర్ బిజీగా పని చేస్తున్న సంగతి తెలిసిందే. దసరా తర్వాత టీఆర్ఎస్ స్థానంలో బీఆర్ఎస్ లేదా మరో పేరుతో కొత్త పార్టీ రాబోతోందనే దానిపై చర్చ జరుగుతున్నది. ఇదిలా ఉంటే ఉప ఎన్నిక షెడ్యూల్ టైమ్ లో కాంగ్రెస్ ఫుల్ బిజీగా ఉండబోతోంది. భారత్ జోడో యాత్ర తెలంగాణలో సాగనున్న రూట్ మ్యాప్ అంతా ఖరారైంది. రాహుల్ యాత్ర కోసం ఇప్పటికే డీజీపీని కలిసిన పీసీసీ బృందం వినతిపత్రం సైతం అందజేసింది. అక్టోబర్ 24న తెలంగాణలో రాహుల్ గాంధీ యాత్ర ప్రవేశిస్తుంది. మొత్తం 13 రోజుల పాటు రాష్ట్రంలో కొనసాగనుంది. కర్ణాటక నుంచి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్ వద్ద తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చే భారత్ జోడో యాత్ర.. మక్తల్ నుంచి దేవరకద్ర, మహబూబ్ నగర్ టౌన్, షాద్ నగర్ మీదుగా శంషాబాద్, ఆరాంఘర్, చార్మినార్, అఫ్జల్ గంజ్, ఎంజే మార్కెట్, గాంధీ భవన్, నాంపల్లి దర్గా, విజయ్ నగర్ కాలనీ పెన్షన్ ఆఫీస్, నాగార్జున సర్కిల్, పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, పటాన్ చెరు, ముత్తంగి(ఓఆర్ఆర్) మీదుగా సంగారెడ్డికి చేరుకుంటుంది. అక్కడి నుంచి జోగిపేట, శంకరంపేట్, మద్నూర్ మీదుగా మహారాష్ట్రలోకి ఎంటర్ కానుంది. తెలంగాణలో మొత్తం 375 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగనుండగా ఇదంతా మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం పీక్స్ లో ఉండాల్సిన సమయంలో జరగనుంది.

# ఈ సీజన్ లో భారీ వర్షపాతం నమోదు

హైదరాబాద్, అక్టోబరు 4, :రాష్ట్రంలో ఈ సీజన్‌లో 46 శాతం అధిక వర్షపాతం నమోదైంది. పది జిల్లాల్లో అత్యంత అధికం, 19 జిల్లాల్లో అధికం, నాలుగు జిల్లాలో సాధారణ వర్షపాతాలు రికార్డయ్యాయి. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో 91 శాతం అధికంగా వర్షం కురిసింది. సీజన్ సాధారణ సగటు వర్షపాతం 734.8 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకూ(సెప్టెంబర్ 30) 1073.3 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. గతేడాది ఇదే సీజన్‌లో 1044.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. అంటే గతేడాదితో పోల్చిచూసినా ఏడు శాతం అధిక వర్షపాతం ఈ ఏడాది నమోదైంది. నిజామాబాద్(1577మిల్లీమీటర్లు), జగిత్యాల(1550 మిల్లీమీటర్లు) జిల్లాల్లో సాధారణం కంటే 91 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. రాష్ట్రంలో అత్యల్పంగా నల్లగొండ జిల్లాలో 505.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఐదు శాతం తక్కువ కురిసింది.

అత్యంత అధిక వర్షపాతం(60 శాతానికి కంటే ఎక్కువ) పడిన జిల్లాలు 10

నిర్మల్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జనగాం, నారాయణపేట, ములుగు

అధిక వర్షపాతం(20 శాతం నుంచి 59 శాతం వరకు అధికం) పడిన జిల్లాలు 19

ఆదిలాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం

సాధారణ వర్షపాతం (–19 నుంచి 19 శాతం వరకు) నమోదైన జిల్లాలు 4

నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, వనపర్తి

# చేవెళ్ల ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఇంద్రన్న




చేవెళ్ల, అక్టోబర్ 04 ( ప్రజా పాలన) :చేవెళ్ల,ముద్దు బిడ్డ ,మాజి హెూం మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామంలోని ఇంద్రన్న సమాధి వద్ద మంత్రి సబితా ఇంద్రారెడ్డి,చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య నివాళలర్పించారు.అలాగే చేవెళ్ల,చిట్టంపల్లి గేటు,ఖానాపూర్ గేట్ వద్ద స్వర్గీయ ఇంద్రన్న విగ్రహాలకు పూల మాలలు వేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా అరబిందో ఫార్మా కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన పాఠశాల లో నాలుగు తరగతి గదులను మంత్రి సబితా ఇంద్ర రెడ్డి,ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంద్రన్న పుట్టి పెరిగిన గ్రామంలో జయంతి రోజున కోటి రూపాయలతో నిర్మించిన 4 తరగతి గదులను ప్రారంభించటం సంతోషంగా ఉ౦దన్నారు. ఇంద్రారెడ్డి శివరాం పల్లిలో చదువుకునేటప్పుడు పరీక్షల ఫీజు చెల్లించటానికి ఆఖరి రోజున డబ్బులు లేకుంటే సైకిల్ మీద కౌకుంట్లకు వచ్చి డబ్బులు తీసుకొని తిరిగి సైకిల్ పై వెళ్లి ఫీజు చెల్లించారని గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యా కోసం ఇంద్రారెడ్డి చాలా కష్టాలు పడ్డారని,నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో విద్యాకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తెలంగాణలో వెయ్యికి పైగా గురుకులాలు నెలకొల్పి అందులో అన్నింటినీ ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేశారని మంత్రి తెలిపారు. గురుకులాలకు బాగా డిమాండ్ ఏర్పడిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ బడులను కూడా గురుకులాల వలె తీర్చిదిద్దటానికి అదేశించారన్నారు. తెలంగాణ లాంటి పాలన దేశమంతా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అందుకు మన ముఖ్యమంత్రి కేసీఆర్ వేసే అడుగులో మనం అందరం అడుగు వేసి కెసిఆర్ కు అండగా నిలబడాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. దసరా సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పార్టీ ప్రకటించనున్న నేపథ్యంలో మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని రైతులు తెలంగాణ రాష్టం వలె 24 గంటల ఉచిత విద్యుత్,రైతు బంధు,రైతు భీమా కోరుకుంటున్నారని అన్నారు. అడబిడ్డల పెళ్లిళ్లకు ఇస్తున్న కల్యాణ లక్ష్మి, షాది ముబారాక్ తో పాటు వివిధ రకాల పెన్షన్లు 2 వేల నుండి 3 వేల వరకు దేశమంతా ఇవ్వాలంటే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ వలె స్వచ్ఛ పట్టణాలు,పల్లెలు భారత దేశంలో రావాలంటే కేసీఆర్ పాలన రావాలన్నారు. దసరా పర్వదినం సందర్భంగా జాతీయ పార్టీ ప్రకటించనున్న సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజల మద్దతు కేసీ ఆర్కుఉంటుందన్నారు. ఇంటింటికి నల్లా ఇచ్చిన మిషన్ భగీరథ పథకంతో పాటు,మిషన్ కాకతీయ లాంటి పథకాలు దేశం అంతా అమలు కావాలంటే దేశంలో తెలంగాణ పాలన రావాలని,ఈ దిశలో దసరా పర్వదినం నాడు జాతీయ రాజకీయాలలో వేస్తున్న తొలి అడుగు విజయవంతం కావాలని ఆకాంక్షించారుకౌకుంట్ల గ్రామంలో పాఠశాల అభివృద్ధి లో భాగంగా నిధులు అందించిన అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధి సదానందరెడ్డిని మంత్రి సన్మానించి, కంపెనీ సభ్యులను అభినందించారుఅదేవిధంగా 5 కోట్లతో కౌకుంట్ల గ్రామంలో రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ముందుకు వచ్చినఎన్ సిసి సంస్థ వారికి కూడా ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య నిధుల నుండి 50 లక్షలతో గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి,ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి,జడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి,వైస్ ఎంపీపీ ప్రసాద్, ఫార్మా కంపెనీ ప్రతినిధి సదానంద రెడ్డి ,ఆర్జేడీ విజయలక్ష్మి ,డి ఈ ఓ సుశీందర్ రావు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు రమణారెడ్డి కృష్ణారెడ్డి విట్ట వెంకట రంగారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ కౌకుంట్ల గ్రామ సర్పంచ్ కండ్లపల్లి గాయత్రి గోపాలకృష్ణ ,ఉప సర్పంచ్,ఇనాయత్, టిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి చటరి దశరథ్, వివిధ గ్రామాల సర్పంచులు, టిఆర్ఎస్ యువ నాయకులు నారే గూడెం అంజనేయులు ,ఉదయ్,శివ, ప్రశాంత్ ,ప్రవీణ్ వార్డు మెంబర్లు,తదితరులు గ్రామ ప్రజలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | |
|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | మధిర రూరల్ | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్యా.శ్రీను | బోనకల్ | 8688810293 |
| సి.మల్లేష్ | ఇబ్రహీంపట్నం | 9618028334 |
| దుంపాల రాజేష్ | మేడ్చల్ | 9000178307 |
| వై.నర్సింహులు | తాండూరు | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | కొడంగల్ | 9866027635 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |
| గొట్టె సురేందర్ | మంచిర్యాల టౌన్ | 9248528680 |
| గొడ్లబాబూరావు | తల్లాడ | 9848236015 |
| ఎల్.వెంకట్ | మందమర్రి | 8106891666 |
| మహమ్మద్ హాఫీజుద్దీన్ | కేతనపల్లి | 9701844456 |
| సాయిబాబు | భద్రాద్రి కొత్తగూడెం | 9603149645 |
| ఎన్.బండయ్య | చేవెళ్ల | 9959032940 |
| నరేందర్ | చేవెళ్ల | 9490148304 |
| ఎం.పరమేష్ | శంకరపల్లి | 7989723793 |
| ఊదిరి మహేష్ | చౌటుప్పల్ | 9550941419 |


## పలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్న జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత మరియు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ప్రజా పాలన :దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా బూర్గంపాడు జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత మరియు రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి పలు పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రులలో భాగంగా ప్రతి ఒక్కరు కూడా దేవి పూజ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని మరియు అందరి ఇండ్లలో కూడా సుఖసంతోషాలు వెదజల్లాలని ప్రజలందరూ కూడా ఆనందోత్సవాలతో పూజలు జరుపుకోవాలని వారు ఈ సందర్భంగా తెలియజేయడం జరిగినది. అంతేకాకుండా రేగ సుధారాణి మాట్లాడుతూ ప్రజలు బతుకమ్మ పండుగ తో పాటు దేవి శరన్నవరాత్రులు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని వారు చెప్పారు. చెడును పాల ద్రోలి మంచిని స్వీకరించే విధంగా దేవి ఆశీర్వాదం అందరికీ ఉంటుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు మరియు బూర్గం పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి మరియు బూర్గంపాడు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కామిరెడ్డి కొండారడ్డి, సోషల్ మీడియా యూత్ చల్లకోట పూర్ణ, టౌన్ ప్రెసిడెంట్ కొనకంచి శీను బొబ్బిలి, ఏసోబు బాలు శ్రీహరి టౌన్ యూత్ చైతన్య రెడ్డి, ఏసోబు, లలిత రమణ సురేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ప్రజా పాలన: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లి గ్రామానికి చెందిన లక్క కాంతమ్మ (75) సంవత్సరాలు ఇటీవల కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడంతో వారి నివాసానికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. నేనున్నాను అంటూ భరోసా కల్పించడం జరిగినది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ %ు% పినపాక శాసనసభ్యులు %ు% భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ రేగా కాంతారావు . ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పోషం నరసింహారావు ఇతర టిఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది వీఆర్ఏలకు నిత్యవసర సరుకులు పంపిణీ



బోనకల్, అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి:మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ముందు గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న 33 మంది రెవెన్యూ గ్రామ సహాయకులకు సంఘీభావంగా మంగళవారం మండల తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది సుమారు 50 వేల రూపాయలు వ్యయంతో బియ్యం, నిత్యవసర సరుకులు తాసిల్దార్ రావూరి రాధిక చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రావూరి రాధిక, డిప్యూటీ తాసిల్దార్, ఆర్ ఐ గుగులోతు లక్ష్మణ్, టైపిస్ట్, ఆళ్ళపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బియ్యపు గింజపై ఎమ్మెల్సీ రమణ చిత్రపటం



జగిత్యాల, అక్టోబర్ 04 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ యొక్క చిత్రపటాన్ని బియ్యం గింజ పై చెక్కి ఎమ్మెల్సీ నివాసంలో బహూకరణగా అందజేశారు. తన కళానైపుణ్యాని మెచ్చుకున్న ఎమ్మెల్సీ అతనికి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## గాంధీని అవమానపరిచిన వారిని వెంటనే శిక్షించాలి




మంచిర్యాల టౌన్, అక్టోబర్ 04, ప్రజాపాలన: గాంధీని అవమానపరిచిన వారిని వెంటనే శిక్షించాలని వైశ్య సంఘాల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీని కలకత్తాలో హిందూ మహాసభ పేరిట ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాత విగ్రహం వద్ద మహిషాసురుని స్థానంలో మహాత్ముని పోలిన బొమ్మను ఉంచడం సరికాదని అన్నారు, ఈ ఘటనకు పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ముక్త శ్రీనివాస్, ఆవోప సిరిపురం శ్రీనివాస్, మాదంశెట్టి సత్యనారాయణ, కొండ చంద్రశేఖర్ , పట్టణ దొంతుల ముఖేష్ ,వాసవి కంభంపాటి కమలాకర్ , కేశెట్టి వంశీకృష్ణ ,సాయిని సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి కొరకు లక్ష రూపాయల ఎల్ఐసి బీమా చెక్కు బహికరించిన కైపు కగేందర్ రెడ్డి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ప్రజా పాలన. 2020-21 ఆర్థిక సంవత్సరం రానికి మొరంపల్లి బంజర్ లో 100 ఎల్ఐసి పాలసీలు చేసినదుకు గాను భీమా గ్రామము ఆయనది. దినికి గాను గ్రామ అభివృద్ధి కి కైపు ఖగేంద్రరెడ్డి ద్వారా %ూ×జ% వారు గ్రామ సర్పంచ్ గారికి 100000(లక్ష)రూపాయలు ఇవ్వడం జరిగినది . దీనికిగాను పాలకవర్గం వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో %ూ×జ% సీనియర్ బ్రాంచిమేనేజర్ %చీ% గోపాలకృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విశ్వేశ్వరుడు , సర్పంచ్ దివ్యశ్రీ గారు, వార్డ్ మెంబర్ కామీరెడ్డి పద్మ, రామలక్ష్మి గ్రామ పెద్దలు మేడం లక్ష్మీనారాయణ రెడ్డి, కైపు సుబ్బరామిరెడ్డి , ఎల్ఐసి వ్యాపారానికి సహకరించేనటువంటి బంధుమిత్రులు స్నేహితులకు చిరు సన్మానించడం జరిగినది, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కైపు కగేందర్ రెడ్డి మాట్లాడుతూ జీవిత బీమా అనేది ప్రతి ఒక్కరు కూడా చేసుకోవాలని అది భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలియజేయడం జరిగినది. కాబట్టి అలాంటి జీవిత బీమాను కాపాడు కావాలని నాకు సహకరించినటువంటి పెద్దలందరికీ కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని నాగేందర్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టి పేదవారికి అండగా ఉంటానని వారు తెలియజేయడం జరిగినది.

## ఘనంగా బూర్గంపాడు మండల ఎమ్మార్వో భగవాన్ రెడ్డి జన్మదిన వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ప్రజా పాలన :మండల ప్రజాఅభివృద్ధి -సంక్షేమ రంగాలలో అలుపెరగని అధికారిగా శ్రీ భగవాన్ రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నాడు. నాడు కరోనా సమయంలోనైనా-నేటి గోదావరివుుంపు పరిస్థితిల్లోనైనా ప్రజలకు అండగా-ఆత్మబాంధవిడిగా నిలవడం "ఆయన" వ్యక్తిత్వం. ఆయన రాకతో-ఆయన మార్క్ తో మండలానికి ప్రత్యేక గుర్తింపు-ఆయన అభివృద్ధిపాలనతో జిల్లాలోనే అరుదైన గౌరవం. రావడం ఆయన సేవలకు అద్దం పడుతుంది. పరిపాలనాదక్షత కలిగిన అధికారిగా-సుపరిపాలన అందించే అభిమన్యుడిగా ప్రగతిపథంలో నడిపిస్తున్న ప్రభుత్వ ప్రతినిధినే శ్రీ భగవాన్ రెడ్డి తదుననుగుణంగా నేడు బూర్గంపహాడ్ మండల మేజిస్ట్రేట్(రెవెన్యూ అధికారి) జన్మదినం సందర్భంగా మండల ప్రజలు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.

## నవరాత్రి ఉత్సవాల్లో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని



బోనకల్ ,నవంబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి:మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామంలో దేవి నవరాత్రులు సందర్భంగా అమ్మవారి మండపం లో కనకదుర్గమ్మ తల్లి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ పక్ష నేత మధిర శాసన సభ్యులు మల్లు భట్టివిక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందినివిక్రమార్క హాజరయ్యారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షుడు కందుల పాపారావు,సోసైటి చైర్మన్ కర్నాటి కోటి,గ్రామ శాఖ అధ్యక్షులు, ఎంపిటిసి, గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## దసరాను ఘనంగా జరుపుకోవాలి..: కుర్నవల్లి సొసైటీ చైర్మన్ ప్రదీప్ రెడ్డి..



తల్లాడ, అక్టోబర్ 4 (ప్రజా పాలన న్యూస్): విజయదశమి (దసరా) పర్వదిన వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కుర్నవల్లి సహకార సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరిగాయన్నారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా సీఎం కేసీఆర్ మంచి నిర్ణయం తీసుకొని కార్యక్రమాలు చేపట్టారన్నారు. దసరా పండుగ మీ జీవితాల్లో వెలుగులు నింపాలని, మండల ప్రజలకు ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## దళిత బంధు పథకం దళితుల అందరికీ వర్తింప చేయాలి: వైయస్సార్ టిపి మండల నాయకులు



బోనకల్, అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి:మండలంలో దళిత బందు 22 గ్రామాలకు వర్షింప చేయాలని, అర్హత కలిగి ఉన్న ప్రతి వ్యక్తికి దళిత బంధు అందించాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ బోనకల్ మండల యూత్ అధ్యక్షుడు మందా నాగరాజు , మండల అధ్యక్షుడు ఇరుగు జానేషు మండల అధికార ప్రతినిధి మర్రి ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న దళిత కుటుంబాలకు ఆర్థిక స్తోమత లేక ఎంతో ఇబ్బంది పడుతున్నారని, దళిత బంధు పథకాన్ని వర్తింపజేసి వారి జీవితములో వెలుగులు నింపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. దళిత బంధువుపై చిన్నచూపు చూస్తూ దళితులను చిన్నచూపు చూస్తూ వారి కుటుంబాలపై దాడులు చేస్తూ పలు రకాల హింసిస్తూ వివక్షతకు గురి అవుతున్నారని అన్నారు. మనుషులంతా సమానమైన బావలతో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలగాలని ఈ కార్యక్రమంలో ముష్టికుంట గ్రామ అధ్యక్షుడు ఎస్.కె మౌలాలి, రామాపురం గ్రామ అధ్యక్షుడు దొంత గోపి, రావినూతల గ్రామ అధ్యక్షుడు తాళ్లూరి ఆరోను ,గార్లపాడు గ్రామ అధ్యక్షుడు కట్ల రాజయ్య, ఆళ్ళ పాడు గ్రామ అధ్యక్షుడు కందుల వెంకయ్య ,రాయనపేట గ్రామ అధ్యక్షుడు వెదల గోపి, మండల ఉపాధ్యక్షుడు ఎస్ డి సైదా బాబు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేసిన కార్పొరేటర్ రాజేశ్వరి అంజిరెడ్డి



మేడిపల్లి, అక్టోబర్ 4 (ప్రజాపాలన ప్రతినిధి) దసరా పండగను పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి కొత్త బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డ్ ఆఫీసర్ మహమ్మద్ వాజిత్,మున్సిపల్ సిబ్బంది ప్రభాకర్,రాజు,విజయమ్మ,పోచమ్మ, బాలమని,శారద తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

### ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్ కె అబ్దుల్లా



జన్నారం, అక్టోబర్ 04, ప్రజాపాలన: ఆదివాసి గిరిజనులు పోడు చేసుకొని సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం జన్నారం మండల అధ్యక్షుడు ఎస్.కె అబ్దుల్లా అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో మండలంలోని ధర్మారం, బాదంపల్లి, రాయికుంట, గోండు గుడా, తపాలాపూర్, గడ్డం గుడా, తదితర గిరిజన గుడాలకు చెందిన పలువురు గిరిజనులకు ఆదివాసి గిరిజన సంఘం కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసీలు గతంలో పోడు చేసుకొని ప్రస్తుతం సాగు చేసుకుంటున్నా భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు .లేకుంటే ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ భూమిని కబ్జా చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో పేద ప్రజలకు ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఐదు లక్షల 50వేల రూపాయలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆదివాసి హక్కులను సాధించుకోవాలంటే ఆదివాసీ గిరిజన సంఘాన్ని మరింత బలం పేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రతి గిరిజనులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరం అశోక్, బీడీ, సిగార్ యూనియన్ జన్నారం మండల కార్యదర్శి కూకటికారి బుచ్చయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జన్నారం మండల అధ్యక్షుడు రాజన్న, వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తోట రామాంజనేయులు ఎన్నిక



బోనకల్ ,అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి: భారతదేశంలోనే ప్రధమ కార్మిక సంఘమైన, కార్మిక ఉద్యమంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన తోట రామాంజనేయులు ఎన్నికయ్యారు. నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తోట రామాంజనేయులు గతంలో అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) లో కీలకంగా పని చేశారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నా సమయంలో రామాంజనేయులు అలుపెరుగని పోరాటాలు నిర్వహించారు . 2009 లో అప్పటి ప్రభుత్వ విద్యను ప్రయివేటు పరం చేసేందుకు గాను విడుదల చేసిన జీవో నెంబర్ 75 కు వ్యతిరేకంగా మధిరలో పోరాటం చేసి 3 రోజుల పాటు జైలు కు వెళ్ళారు .తెలంగాణా ఉద్యమంలో 100 పైగా సార్లు అరెస్ట్ అయ్యి వివిధ సందర్భాలలో అనేక రోజులు జైలు సైతం వెళ్ళటం జరిగింది . ముఖ్యంగా 2012 లో జరిగిన హాస్టల్ విద్యార్థుల సమస్యలపై నిర్వహించిన ఆకలి కేక కార్యక్రమంలో అరెస్ట్ అయ్యి 12 రోజుల పాటు ఖమ్మంకు జైలుకూ వెళ్లారు .బోనకల్ మండల కార్యదర్శి గా ఉన్నా సమయంలో సీపీఐ ని బలోపేతం చెయ్యడానికి ఆయన అనేక రకాలుగా కృషి చేసారు. కార్మిక ఉద్యమంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన, మొదటి కార్మిక సంఘము అయిన ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తోట రామాంజనేయులకు సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి వెంగల ఆనందరావు,జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు, మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, సిపిఐ సీనియర్ నాయకులు జక్కా నాగభూషణంతోపాటు మండలంలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలుగు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



మధిర అక్టోబర్ 4ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సీఎల్పీ భట్టి విక్రమార్క విజయ్ దశమి నియోజకవర్గం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎల్పీ భట్టి విక్రమార్కవిజయదశమి పర్వదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీసీఎల్పీ నేత భట్టి విక్రమార్క దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరికి అన్నింటా శుభం చేకూరాలని వేడుకున్నారు. లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, దుష్ట శక్తులపై దైవశక్తుల విజయానికి ప్రతీకగా ఈ పండుగ జరుపుకుంటున్నామని వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని, ఎప్పటికైనా మంచిదే అంతిమ విజయమని మానవాళికి చాటి చెప్పిందని ఆయన తెలిపారు. దసరా పండుగలో మన సాంప్రదాయం, సంస్కృతితో పాటూ ఆత్మీయత ఉందన్నారు.జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు కలిగేలా దుర్గామాత దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

## దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అన్నదానం



మధిర రూరల్ అక్టోబర్ 4 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు దేవీ నవరాత్రుల సందర్భంగా ముఖ్యఅతిథిఅన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన డా.కోట రాంబాబు దేవీ నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మధిర లోని శివాలయం రోడ్ నందు వక్రతుండ వినాయక కమిటీ వారు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఆరెఎస్ పార్టీ జిల్లా నాయకులు లిడా.కోట రాంబాబులి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ వారు డా.కోట రాంబాబు కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అక్కడ ఉన్న మహిళలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరి మీద వుండాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించి కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతూ ఈ అన్నదానం కార్యక్రమంలో ప్రజలు భారీగా తరలివచ్చి అన్నదానాన్నిస్వీకరించి అమ్మ కృపకు పాత్రలు అయ్యారని వారు తెలిపారు అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాపం..పీకే

పాట్నా, అక్టోబరు 4, :ప్రశాంత్ కిశోర్.. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త. జనం నాడిని అంచనా వేయడం, ప్రత్యర్థుల్ని దెబ్బకొట్టేలా, ప్రజల మెప్పు పొందేలా ప్రచార వ్యూహాలు రచించడంలో ప్రశాంత్ కిశోర్ దిట్ట అని చెబుతుంటాయి రాజకీయ వర్గాలు. అలాంటి ఆయన తన పార్టీ అయిన జన సురాజ్ ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 3,500 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు.ఈ పాదయాత్రలో భాగంగా పశ్చిమ చంపారణ్ జిల్లా బేతియాలో బహిరంగ సభ కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఇతర పార్టీల కోసం వ్యూహాలు పన్నడంలో దిట్ట అయిన పీకేకు తొలిరోజే నిరాశ ఎదురైంది. తన భారీ బహిరంగ సభకు అనుకున్న స్థాయిలో జనం రాలేదు. మైదానం మొత్తం ఖాళీగా దర్శనమిచ్చింది. సభా ప్రాంగణంలో కనిపించినవారిలో కొందరు.. పీకే కోసం రాలేదని, అక్కడి గాంధీ ఆశ్రమ సందర్శన కోసం వచ్చినవారన్నది స్థానికుల మాట.రాజకీయ వ్యూహకర్తగా ఇప్పటి వరకు తెరవెనుక ఉండి పనిచేసిన పీకే.. ఇప్పుడు నేరుగా కదన రంగంలోకి దిగారు. స్వరాష్ట్రం బిహార్?లో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ స్థాపనే లక్ష్యమంటూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. జన సురాజ్ పేరిట ఆ రాష్ట్రంలో 3,500 కి.మీ. పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పశ్చిమ చంపారణ్ జిల్లాలో ఆయన ఈ పాదయాత్ర ప్రారంభించారు. పీకే పాదయాత్ర 12 నుంచి 18 నెలల పాటు కొనసాగనుంది.

## దేశ వ్యాప్తంగా మత్స్యకారుల మద్దత్తు కేసిఆర్ కే: మత్స్యకారుల సమన్వయ సంఘం సభ్యుడు గుండ్లపల్లి శ్రీనివాస్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):రాష్ట్ర నేత, దేశ నేత గా మారుతున్నందుకు, కేంద్రస్థాయిలో పార్టీ ఏర్పాటు చేయనున్న ముఖ్యమంత్రి కె సి ఆర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు మత్స్య కారుల సంఘం. రాష్ట్రం లో వెయ్యి కోట్లతో మత్స్య కారులకు నిధులు అందజేసిన కె సి ఆర్, దేశవ్యాప్తంగా మత్స్య కారులకు న్యాయం చేస్తారని నమ్మకం తమకుంది అని అన్నారు. కేంద్రం లో నేటికి బీసీ లకు మంత్రిత్వ శాఖ లేదన్నారు,రాష్ట్రం లో మత్స్య కారుల సంక్షేమం కొరకు కృషి చేస్తున్న కేసిఆర్ కు కేంద్రస్థాయిలో మత్స్యకారుల అండ ఉంటుందని అన్నారు.ఒక్క గుజరాత్ లోనే తమ మత్స్య కారులకు సంబందించి నాలుగు వేల పై చిలుకు సంస్థ లున్నాయని, త్వరలో ఢిల్లీ లో జరగబోయే తమ జాతీయ స్థాయి సమావేశం లో ఈ ప్రస్తావన తీసుకు రాబోతున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో మత్స్యకార సమన్వయ కమిటీ సభ్యులు అల్లుడు జగన్ , గుండ్లపల్లి శ్రీనివాస్,బల్ల సత్తయ్య ముదిరాజ్. లతో పాటు దమ్మిగారి కనకయ్య,రంజిత్,కాగిత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత

### ఎఫ్ డి ఓ సిరిపురం మాధవరావు




జన్నారం, అక్టోబర్ 04, ప్రజాపాలన: మండలంలోని టి డి సి హాల్లో వన్యప్రాణి సప్త కార్యక్రమంలో భాగంగా మండలంలోని విద్యార్థులకు అడవి వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత కు సంబంధించిన విషయాల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖన ఉపన్యాస పోటీలను ఎఫ్ డి ఓ సిరిపురం మాధవరావు నిర్వహించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల టి డి సి హాల్లో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అడవిని రక్షించ బాధిత తీసుకొని, వన్యప్రాణులను కాపాడవలసిన బాధ్యత మన అందరిదీ అని ఆయన తెలిపారు. అడవులను జంతువులను మనం కాపాడినప్పుడే మానవ మునగడ సాధ్యమవుతుందని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత పై వ్యాసరచన చిత్రలేఖన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎఫ్ డి వో మాధవరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అఫీజొద్దీన్, ఎన్ సిసి అధికారి కట్ట రాజమౌళి, ఉపాధ్యక్షులు చందులాల్, శ్రీనివాస్, రమేష్, తిరుపతి, ఫారెస్ట్ అధికారులు, డి ఎఫ్ ఆర్ ఓ తిరుపతి, రహీముద్దీన్, అనిల్ కుమార్, కమలాకర్, ఎఫ్ బి వో లు, జన్నారం బాయ్స్ హై స్కూల్, కలమడుగు హై స్కూల్, చింతగూడ హై స్కూల్, స్లేట్ హై స్కూల్, రాఘవేంద్ర లిటిల్ హాండ్స్ హై స్కూల్ ల విద్యార్థులు విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.

## చెడుపై విజయానికి ప్రతీక దసరా..: జడ్పీటీసీ దిరిశాల ప్రమీల..



తల్లాడ, అక్టోబర్ 3 (ప్రజాపాలన న్యూస్): సమాజంలో చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి (దసరా) పండుగను జరుపుకుంటారని తల్లాడ జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, టిఆర్ఎస్ పార్టీ జోనల్ చైర్మన్ దిరిశాల దాసురావు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. విఘ్నేశ్వరుడు కరుణతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు వారు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



జన్నారం, అక్టోబర్ 04, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన మంద మోక్షరాణి రెండు కిడ్నీలు చెడిపోవడమే కాకుండా కడుపులో అవస్థతో హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చేరి చికిత్స కోసం లక్షల అప్పు చేశారని ఈ విషయం తెలుసుకుని మంగళవారం జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు ఆద్వర్యంలో మెక్షరాణి కుటుంబానికి రూ, 5000/- ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజేష్ మాట్లాడుతూ జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల ఉదయ్ కుమార్ (ఆర్మీ), ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఈ సహాయం చేయడం జరిగిందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం మన కర్తవ్యామని, యువకులు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని, దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సహాయము చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు భవాండ్లపెల్లి హేమంత్ చారి, కొండూకురి ప్రభుదాస్, మామిడిపెల్లి రాహుల్, రాజేందర్, ప్రమోద్, గ్రామస్తులు కస్తూరి దుబ్బాయ, తదితరులు పాల్గొన్నారు.

# ఘోస్ట్" లో ఈ యాక్షన్ సీక్వెన్స్ లు అదిరిపోతాయి: నాగార్జున



టాలీవుడ్ కింగ్ నాగార్జున హీరోగా సోనాల్ చౌహన్ ఫీమేల్ లీడ్ లో నటించిన లేటెస్ట్ సాలిడ్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం "ది ఘోస్ట్" కోసం అందరికీ తెలిసిందే. దర్శకుడు ప్రవీణ్ సత్తారు తెరకెక్కించిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనగా ఈ చిత్రం రేపు దసరా కానుకగా అయితే థియేటర్స్ లో విడుదల కాబోతుంది. ఇక ఇప్పుడు ఈ చిత్ర యూనిట్ అంతా కూడా ఇంటెన్స్ ప్రమోషన్స్ లో బిజీగా ఉండగా లేటెస్ట్ గా నాగార్జున అయితే ఈ సినిమాలో కొన్ని యాక్షన్ సీక్వెన్స్ ల కోసం ఇంట్రెస్టింగ్ అప్డేట్ రివీల్ చేశారు.సినిమా అంతా ఒక సాలిడ్ యాక్షన్ ప్యాక్ లా షాకిచ్చే విధంగా ఉంటుంది అని ముఖ్యంగా అయితే సినిమాలో క్లైమాక్స్ లో వచ్చే చర్చ్ ఫైట్ సీక్వెల్ హైలైట్ గా నిలుస్తుంది అని కింగ్ నాగ్ లేటెస్ట్ మీడియా ఇంటరాక్షన్ లో అయితే తెలిపారు. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అలాగే దర్శకుడు కూడా ఈ సినిమాలో ఏకంగా 12 యాక్షన్ సీక్వెన్స్ లు ఉన్నాయని చెప్పారు. మరి ఈ చిత్రం ఎలా ఉంటుందో తెలియాలి అంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

# సుధీర్ బాబు "హంట్" టీజర్ పై రానా కామెంట్స్!




సుధీర్ బాబు హీరోగా భవ్య క్రియేషన్స్ పతాకం పై వి. ఆనంద ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా హంట్. మహేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం లో శ్రీకాంత్, ప్రేమిస్తే ఫేమ్ భరత్ లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేయగా, దానికి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. టీజర్ సినిమాపై విపరీతమైన అంచనాలు పెంచిందని చెప్పాలి. అయితే తాజాగా పాన్ ఇండియా నటుడు రానా దగ్గుపాటి టీజర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చూడటానికి చాలా కూల్ గా ఉంది, గుడ్ లక్ అంటూ చెప్పుకొచ్చారు. జిబ్రాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.




# అలాగైతే ఆ కుర్రభామ వర్మ చేతిలో పడాల్సిందే!



సైకో సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలు తెరకెక్కించడంలో సంచలనాల రాంగోపాల్ వర్మ ఎంతటి ఘనాపాటో చెప్పాల్సిన పనిలేదు. సైకో కథలపై వర్మ దృష్టి పెట్టాడంటే? ఎంతటి రియాల్టీ పండిస్తాడో గత చిత్రాలే చూస్తే సరి. సైకోలపై ఆయనంత గొప్పగా మరో మేకర్ స్టడీ చేయలేదు. ఆయన ఎనాలసిస్..అబ్జర్వేషన్..స్టడీ అంతా చాలా డీప్ గా ఉంటుంది.ఇలాంటి సినిమాలకు పెట్టింది పేరుగా వర్మని అంతా సైకో ఫ్యాషినేటెడ్ ఫ్యాన్స్ అంతా జపిస్తుంటారు. మరి వర్మ మళ్లీ అలాంటి ప్రయత్నమేదైనా చేస్తున్నాడా? అంటే చెప్పడం కష్టం గానీ ఓ యంగ్ హీరోయిన్ సైకో పాత్రల్లో నటించాలని పరవశించిపోతుంది. ఛాన్స వస్తే ఎలాంటి సైకోగా నటించడానికైనా సిద్దంగా ఉంటానంటోంది. ఇంతకీ ఎవరా భామ అంటే బెంగళూర్ బ్యూటీ వర్ష బొల్లమ్మ.అమ్మడు టాలీవుడ్ కి సుపరిచితమే. తమిళ్..మలయాళంలో కొన్ని సినిమాల్లో నటించిన అమ్మడు అటుపై 'చూసి చూడంగానే' సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. అటుపై 'జాను'..'మిడిల్ క్లాస్ మెలోడీస్'..' పుష్పక విమానం'..'స్టాండప్ రాహుల్' లాంటి చిత్రాల్లో నటించిన అమ్మడు పాత్రల పరంగా తన ఛాయిస్ ఎలా ఉంటుందన్న విషయాన్ని రివీల్ చేసింది.'అన్ని రకాల పాత్రలు పోషించడానికి సిద్దంగా ఉన్నాను. కాకపోతే ప్రేక్షకులు నన్ను మొదటి నుంచి మధ్యతరగతి అమ్మాయి పాత్రల్లో చూడటానికే ఎక్కువగా ఇష్టపడతారనుకుంటా. ఈ అమ్మాయి పక్కింటి అమ్మాయిలా ఉందని వాళు అనుకోవడం వల్లే ఆ తరహా పాత్రలు ఎక్కువ పేరు తీసుకొస్తున్నాయి. కానీ నా డ్రీమ్ అది కాదు. సైకో పాత్రల్లో ప్రేక్షకుల్ని మెప్పించాలని ఉంది.పాత్రల పరంగా ఛాయిస్ అడిగితే సైకో పాత్రలకే ఇస్తా. ఎందుకంటే వాటిలో నటనకు స్కోప్ ఉంటుంది. రకరకాల హావభావాలు పడ్డించడానికి అవకాశం ఉంటుంది. అలాంటి రోల్స్ కొన్ని అయినా ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొస్తాయి. అలాగే నెగిటివ్ పాత్రలపైనా అంతే ఆసక్తి ఉంది. ఇలాంటి పాత్రలైతే నా నుంచి మరింత బెస్ట్ అవుట్ పుట్ వస్తుంది. ఎక్కువగా ప్రేమించే పాత్రలు దొరికితే ది బెస్ట్ ఇవ్వడానికి అవకాశం ఉంటుందని' చెప్పుకొచ్చింది. అలాగైతే అమ్మడు రాంగోపాల్ వర్మ చేతుల్లో పడాల్సిందే. తను నచ్చే పాత్రలకు వందశాతం న్యాయం చేయగల దర్శకుడు అతను మాత్రమే అంటూ నెటి జనులు కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ భామ సందీప్ కిషన్ తో ఓ సినిమా చేస్తుంది. అలాగే మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

# వాల్తేరు వీరయ్య సంక్రాంతి కి రావడం లేదా?




మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 154వ చిత్రంగా బాబి దర్శకత్వంలో 'వాల్తేరు వీరయ్య' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. సినిమా టైటిల్ ని బట్టే మాస్ కంటెంట్ తో తెరకెక్కుతోన్న చిత్రంగా తెలుస్తోంది. చిరంజీవి పాత్ర ఆద్యంతం ఊర మాస్ గా మలుస్తున్నారు. బాబి మాస్ అభిమానాన్ని మొత్తం రంగరించి చిరు పాత్రని డిజైన్ చేసారు. తన అభిమానమంతా తెరపై కనిపించనుంది. వైజాగ్ వాల్తేర్ నేపథ్యంలో సాగే స్టోరీలో ఇంకా కొన్ని బలమైన పాత్రలు సైతం కనిపిస్తున్నాయి. ఇప్పటికే చిరంజీవి సోదరుడి పాత్రలో మాస్ రాజా రవితేజ నటిస్తున్నారు. ఆ రెండు పాత్రలత మధ్య బలమైన ఎమోషన్ సన్నివేశాలుంటాయని తెలుస్తోంది. రవితేజ తెరపై కనిపించేది కాసేపే అయినా ఉన్నంతసేపు ఓ ఊపు ఊపేసి వెళ్లిపోయేలా పాత్ర ఉంటుందని టాక్.ఇంకా ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ సహా నాగార్జున కూడా భాగమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తంగా భారీ మల్టీస్టారర్ గానే రూపొందుతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు క్లైమాక్స్ కి చేరుకుంది.రెండు నెలలు షూట్ సహా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తిచేయాలన్నది మేకర్స్ ప్లాన్. ఎలాగూ సంక్రాంతి కూడా సమీపంలో ఉన్న నేపథ్యంలో వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేసారు.కానీ ఇప్పుడా ప్లాన్ లో మార్పులొస్తున్నట్లు తాజా సమాచారం.


# రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న శివ కార్తికేయన్ 'ప్రిన్స్'




కోలీవుడ్ నటుడు యువ కార్తికేయన్ హీరోగా జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ కెవి దర్శకత్వంలో రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ ప్రిన్స్. ఎస్ థమన్ సంగీతం అందించిన ఈ మూవీని ద్విభాషా సినిమాగా శ్రీ వెంకటేశ్వరా సినిమాస్ ఎల్ఎల్పి, సురేష్ ప్రొడక్షన్స్, శాంతి టాకీస్ బ్యానర్లు సంయుక్తంగా భారీ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. శివ కార్తికేయన్‌కు జోడీగా మరియా ర్యాబోషప్క హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో టాలీవుడ్ విలక్షన నటుడు సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నారు.ఇక ఇటీవల రిలీజ్ అయిన ఈ మూవీ లోని రెండు సాంగ్స్ ఆడియన్స్ ని ఎంతో ఆకట్టుకుని మూవీ పై మంచి అంచనాలు ఏర్పరిచాయి. ఇక ఈ మూవీని అక్టోబర్ 21న గ్రాండ్ లెవెల్లో రిలీజ్ చేస్తున్నట్లు కొద్దిసేపటి క్రితం యూనిట్ అఫీషియల్ గా ప్రకటించింది. అన్ని వర్గాల ఆడియన్స్ ని ఆకట్టుకునేలా దర్శకుడు అనుదీప్ ఈ మూవీని తెరకెక్కించారని, తప్పకుండా రిలీజ్ తరువాత ప్రిన్స్ మంచి విజయం అందుకుంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తోంది యూనిట్.

# ఆర్ఆర్ఆర్' జపాన్ ప్రమోషన్స్ లో పాల్గొన్న ఎన్టీఆర్

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్ చరణ్ హీరోలుగా డివివి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన పాన్ ఇండియన్ మూవీ ఆర్ఆర్ఆర్. ఈ ఏడాది మార్చిలో రిలీజ్ అయిన ఈ మూవీ ఎంతటి సంచలన విజయం అందుకుందో అందరికి తెలిసిందే. ఆలియా భట్, ఒలీవియా మోరిస్ హీరోయిన్స్ గా నటించిన ఈ మూవీలో ఎన్టీఆర్ కొమురం భీం గా రామ్ చరణ్ అల్లూరి సీతారామరాజుగా నటించి తమ అద్భుత నటనతో అందరి నుండి గొప్ప ప్రశంసలు సొంతం చేసుకున్నారు. ఇక దర్శకదిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళి అత్యద్భుత దర్శకత్వ ప్రతిభ ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం అందుకునేలా చేసింది. అయితే విషయం ఏమిటంటే, ఆర్ఆర్ఆర్ మూవీని అక్టోబర్ 21న భారీ స్థాయిలో జపాన్ లో విడుదల చేసేందుకు సిద్ధం అయింది యూనిట్.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989